విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

సోమవారం 29 సెప్టెంబరు 2025 8 పేజీలు

పేదల సొంతింటి కల

నెరవేరేనా...?

- 30 శాతం మాత్రమే పూర్తయిన ఇళ్లు
- వివిధ దశల్లో ఆగిపోయిన నిర్మాణం
- తీర్మానాలపై పాలకుల ప్రకటనలు నీటిమీద రాతలే

విశాలాంధ్రబ్యూరో - ఏలూరు : సమాజంలో పేదలందరికీ అన్ని సదుపాయాలతో ఇళ్లు నిర్మించి ఇస్తామన్న పాలకుల ప్రకటనలు నీటిమీద రాతలు అయ్యాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడక ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలందరికీ ఇళ్ల నిర్మాణం కార్యక్రమం కార్యాచరణలో ఘోరంగా విఫలమైంది. గృహ నిర్మాణాలు ఒక అడుగు ముందుకి... పది అడుగుల వెనక్కు అన్న చందాన సాగుతున్నాయి. దీంతో పేదలందరికీ సొంతింటి కల ఇప్పట్లో నెరవేరేలా కనిపించడం లేదు. పేదలకు ఇళ్ళు ఇచ్చేందుకు పీఎంఏవై (అర్బన్), పీఎంఏవై (గ్రామీణ), జగనన్న కాలనీల పేరుతో 2020 డిసెంబర్లో జీవో 8,జీవో 9 లోని విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 70 శాతం, 30 శాతం ఖర్చు భరించేలా ఒక్కొక్క లబ్ధిదారునికి 48 గజాల స్థలాన్ని ఇంటి నిర్మాణానికి రూ.1లక్ష 80వేలు నగదు అందజేశారు.

ఈ ఏడాది మార్చి నెలలో పిఎంఏవై 1.0 కాల పరిమితి ముగిసింది. కానీ ఇళ్ల నిర్మాణాలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయార య్యాయి. రుణాల కోసం బ్యాంకులు చుట్టూ తిరుగుతున్నా ప్రయో జనం లేకుండా పోతుందని లబ్ధిదారులు అంటున్నారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన ఐరన్,ఇసుక, సిమెంట్ వంటి నిర్మాణ సామాగ్రి మార్కెట్ రేటు కంటే తక్కువ రేటుకు పంపిణీ చేయాలన్న ఉత్తర్వులు ఒక్కచోట కూడా అమలు కావడం లేదు అని లబ్ధిదారులు వాపోతు న్నారు. జగనన్న కాలనీలో రోడ్లు, డ్రైన్లు, తాగునీరు, విద్యుత్ సరఫరా వంటి సౌకర్యాలు పూర్తిస్థాయిలో నేటికీ అమలు కాలేదని లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వ పరంగా ఇచ్చిన అరకొర సహాయంతో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయలేక 95శాతం మంది లబ్ధి దారులు తమకు కేటాయించిన స్థలాలను వివిధ దశల్లో వదిలేసారని కాలనీలను చూస్తే స్పష్టంగా తెలుస్తోంది. తమకు వచ్చే అల్ప ఆదాయంలో ఎక్కువ శాతాన్ని అద్దె రూపంలో చెల్లిస్తూ లబ్ధిదారులలో ఎక్కువ మంది అద్దె ఇళ్లలోనే జీవనం సాగిస్తున్నారని తెలుస్తోంది.

తాజా గణాంకాలను పరిశీలిస్తే...

గృహ నిర్మాణ శాఖకు సంబంధించిన తాజా గణాంకాలు పరిశీలిస్తే... ఏలూరు జిల్లా వ్యాప్తంగా 1,03,247 ఇళ్లను పూర్తి చేయాలన్నది లక్ష్యం.35,755 ఇల్లు పూర్త య్యాయి. 67,492 పూర్తి చేయాల్సి ఉంది.3570 ఇళ్ల నిర్మాణం అస్సలు ప్రారంభించలేదు.24,755 పునాది దశ కన్నా తక్కువగా ఉన్నాయి. 12,262 ▶మిగతా 2లో..

భగత్ సింగ్ ఆశయాలు సాధిస్తాం

ఘనంగా నివాళులర్పించిన ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర - ఏలూరు : భగత్ సింగ్ 118వ జయంతి సందర్భంగా అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్),ఆధ్వర్యంలో ఆర్.ఆర్. పేట భగత్ సింగ్ సెంటర్‌లో భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు అర్పించి జోహార్ భగత్ సింగ్, సాధిస్తాం భగత్ సింగ్ ఆశయాలు అంటూ నినాదాలు చేశారు. భగత్ సింగ్ విగ్రహానికి మహిళా సంఘం అధ్యక్షురాలు, శ్యామల, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శివకుమార్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశం కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా ఎంచి అమరుడైన మహెూన్నత వ్యక్తి సర్దార్ షాహిద్ భగత్ సింగ్ తన చిన్న తనం నుంచి దేశ స్వాతంత్ర్య కాంక్ష కలిగి బ్రిటిష్ వారి నుండి దేశానికి స్వాతంత్యం తీసుకురావాలని నిరంతరం భగత్ సింగ్ ప్రయత్నం చేశారని కొనియాడారు. జలియన్ వాలాబాగ్ దారుణకాండ నుంచి జనరల్ డయ్యర్‌ను చంపడం ద్వారా జలియన్ వాలాబాగ్ దారుణకాండ అమరులకు నివాళులర్పించాలని పరితపించారని తెలిపారు. దేశంలో పెరిగిపోతున్న మతోన్మాద హింసకు వ్యతిరేకంగా, మతోన్మాద బిజెపి పాలనలో విద్యా విధానంలో సైతం మత సంబంధ అంశాలు పాఠ్యాంశాలుగా చేయడం విచారకర మని అన్నారు. ఈ దేశ స్వాతంత్ర్య ఫలాలను అన్ని వర్గా లకు అందించడానికి ▶మిగతా 2లో..

భగత్ సింగ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి 8లో

నేరస్థులు సత్ప్రవర్తనతో ఉండాలి 2లో

జాతీయ రహదారులు పారిశ్రామిక, వ్యవసాయ రంగాల అభివృద్ధిలో కీలక భూమిక

మంత్రి వాసంశెట్టి సుభాష్

విశాలాంధ్ర - కాకినాడ, రామచంద్రపురం : జాతీయ రహదారులు పారిశ్రామిక, వ్యవసాయ రంగాల అభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తాయని రాష్ట్ర కార్మిక కర్మాగార బాయిలర్లు, బీమా వైద్య సేవల మంత్రి వర్యులు వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం రామచంద్రపురం ఉండూరు రహదారులు భవనాల శాఖ ఆధ్వర్యంలో రహదారి కిమి. 0/0 నుంచి 7/240, వెల్ల, కాపవరం, ఉం డూరు బ్రిడ్జి వరకు అభివృధి పనులకు శంకుస్థాపన భూమి పూజ, వెల్ల గ్రామం ఆంజనేయ స్వామి వద్ద నిర్వహించి పనులను ప్రారంభించారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మంత్రివర్యులు మాట్లాడుతూ రాష్ట్ర రహదారుల నిధుల నుండి ఈ రోడ్డుకు అభివృద్ధికి రూ.3కోట్లు అంచనా విలువతో గ్రానైట్ మెటల్ గ్రానైట్ చిప్స్ రోడ్డుకు ఇరువై పులా బెరమ్స్ ఏర్పాటుకు పనులు నిర్వహిస్తారన్నారు. ఈ రహదారి అభి వృద్ధి మూలంగా ఈ ప్రాం త ప్రజలకు వేగవంతమైన కనెక్టివిటీ ఏర్పడుతుందన్నారు. రహదారి కనెక్టివిటీ పెరగడంతో ఎగుమతులు దిగుమతులు పెరగడంతో పాటు పరోక్షంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఈకార్యక్రమంలో రహదారులు భవనాల శాఖ డివిజనల్ ఇంజ నీర్ సూర్యనారా యణ, జూనియర్ ఇంజ నీర్ వెం కట రమణ, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ అక్కల రిషిత్ రామ్, స్థానిక ప్రతినిధులు, అధికార సిబ్బంది పాల్గొన్నారు.

పామాయిల్ కూలీలకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - ఏలూరు : పామాయిల్ గెలలు నరికే కూలీలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలని, వారికి సంబంధించి సంక్షేమ బోర్డుని ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బికేయంయు) జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వానికి ▶మిగతా 2లో..

ఖాళీ స్థలాలు.. రోగాలకు నిలయాలు

- నోటీసులతో సరి.. ఆచరణ శూన్యం..
- జిల్లాలో పట్టణాలు గ్రామాలలో ఈ దుస్థితి..
- స్థల యజమానుల చిరునామాలు లభించని వైనం

విశాలాంధ్ర- కొవ్వూరు : జిల్లాలో పట్టణాలు, గ్రామాలలో ఖాళీ స్థలాలు రోగాలకు నిలయంగా మారుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తోడు, ఖాళీ స్థలాల పక్కన ఉన్న ఇంటి యజమానులు చెత్తా చెదారాలను అందులో వేయడం వల్ల సమస్య మరింత పెరుగుతోంది. ఈ ఖాళీ స్థలాలలో వర్షపు నీరు భారీ స్థాయిలో చేరి నిలవ ఉండడంతో ఒకవైపు దోమలు, మరోవైపు రోగ కారిక క్రిములు ఆ నీటిపై సంచారం చేస్తూ ప్రజల అనారోగ్యానికి కారణం అవుతున్నాయి. మరోవైపు నిల్వ ఉన్న నీటితో పరిసరాలలో దుర్గంధం ▶మిగతా 2లో..

నెరవేరేనా... (1వపేజీ తరువాయి)

పునాది దశలో ఉన్నాయి. 7,654 స్లాబ్ లెవెల్ లో ఉన్నాయి. 3,728 ఇళ్లకు స్లాబ్ నిర్మాణం పూర్తి అయ్యింది.

పునాది దాటని ఇళ్ల నిర్మాణం...

జిల్లా కేంద్రమైన ఏలూరులోని పోణంగి కాలనీలో 11,050 ఇళ్ళు, కోమడవోలులో 6,800ఇళ్లు మంజూరు య్యాయి.అయితే ఆయా కాలనీలలో కనీసం 10 శాతం ఇళ్ళు కూడా పూర్తిస్థాయిలో నిర్మాణం జరగలేదని తెలుస్తోంది. ప్రభుత్వ సహాయం సరిపోక, సొంత పెట్టుబడులు పెట్టలేక ఎక్కువ మంది లబ్ధిదారులు అద్దె ఇళ్ల లోనే ఉంటున్నారు. ఈ కారణంగా క్షేత్రస్థాయిలో ఎక్కువ చోట్ల పునాది దాటని ఇళ్లే దర్శనమిస్తున్నాయి. రహదారులు, తాగునీరు డ్రైన్లు, విద్యుత్ సదుపాయం వంటి వాటి గురించి అడగకపోవడమే మంచిదని ఆయా ప్రాంతాలను చూస్తే తెలుస్తోంది. వివిధ దశల్లో ఉన్న ఇళ్ళ ముందు తుమ్మ చెట్లు పిచ్చి చెట్లు పెరిగిపోయి నివాస యోగ్యంగా లేవు. కాలనీల్లో అసలు రోడ్లే లేవు.ఈ రకంగా సగంలో మిగిలిపోయిన ఇళ్ల నిర్మాణానికి ప్రస్తుత ప్రభుత్వం సహా యం అందించి తమను ఆదుకోవాలని లబ్ధిదారులు వేడుకుంటున్నారు.

భగత్ సింగ్ ఆశయాలు సాధిస్తాం

(1వపేజీ తరువాయి)

భగత్ సింగ్ చూపిన మార్గంలో పోరాటాలకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు.

జిల్లా కోశాధికారి యం.కాంత్ కుమార్ మాట్లాడుతూ,

భగత్ సింగ్ త్యాగాలను నేటి విద్యార్థులు మరియు యువతరం ప్రేరణగా, స్ఫూర్తిగా తీసుకొని దేశంలో పెరిగిపోతున్న విద్యా విధానంలో , ప్రభుత్వాలు అమలు పరుస్తున్న జీఓ లా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని అదే భగత్ సింగ్ చేసిన పోరాటానికి అసలైన నివాళి అని అన్నారు. మహిళా సంఘం జిల్లా అధ్యక్షు రాలు, శ్యామల మాట్లాడుతూ, భారతదేశం కోసం ప్రాణాలు అర్పిం చిన భగత్ సింగ్ గురించి విద్యార్థులు యువత మరోసారి జ్ఞాపకం చేసుకోవాలన్నారు, భగత్ సింగ్ ఆశయాలను నెరవేరుస్తూ ముం దుకు వెళ్లాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఏలూరు నాయకులు కే. సిద్దు, సునీల్,అనీల్ వంశీ, అఖిల్, పృధ్వి, శ్రీహరి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పీజీఆర్ఎస్ : కలెక్టర్

విశాలాంధ్ర - ఏలూరు : ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని మరింత వేగవం తంగా, ప్రజల దృష్టికి మరింత చేరువ చేయ డం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యా దుల పరిష్కార వ్యవస్థ సేవలను నేడు సోమ వారం మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిల్లో కూడా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్ గోదావరి సమావేశం మందిరంలో నేటి ఉదయం గం.10నుంచి యధా విధిగా పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించబడుతున్నారు. ఫిర్యా దుల స్థితి తదితర సమాచారం తెలుసుకోవాలంటే 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు.ఈ వ్యవస్థ వల్ల ప్రజల సమస్యలు తక్షణమే సంబంధిత అధికారులకు చేరి,సమయానుకూలంగా పరి ష్కారమవుతాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి కోరారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

(1వపేజీ తరువాయి)

విజ్ఞప్తి చేశారు. ఆదివారం కామవరపుకోట ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణలో మండల స్థాయి పామా యిల్ గెలలు నరికే కార్మికుల సమావేశం జి సత్యనారా యణ అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో పాల్గొన్న బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మి కులకు సంక్షేమ బోర్డు ఏ విధంగా ఉందో అదే విధంగా ఉద్యానవన పంటలలో భాగంగా పామాయిల్ గెలలు నరికే కార్మికులకు కూడా సంక్షేమ బోర్డుని ఏర్పాటు చేసి ప్రమా దవశాస్తూ మరణించిన కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందేలాగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పామాయిల్ రైతులు, పామాయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యం కార్మికు లకు న్యాయం చేసే విధంగా కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించే విధంగా కృషి చేయాలని వెంకటేశ్వరరావు కోరారు.సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు గుమ్మడి లక్ష్మీ నారాయణ, సిపిఐ కామవరపుకోట మండల కన్వీనర్ టీవీఎస్ రాజు, బికేయంయు జిల్లా సహాయ కార్యదర్శి గోలిమే బాలయేసు మాట్లాడుతూ పామ ఆయిల్ గెలలు నరికే కార్మికులకు అండగా వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఐ ఉంటుందని వారు తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, పామాయిల్ గెలలు నరికే కార్మికులు టి రావులమ్మ, బండి అనిల్, జక్కుల రామకృష్ణ, కుచ్చులపాటి ధనబాబు, పులపాకుల బాలస్వామి, సిరి శెట్టి బాల సుందరం, నల్ల పోతుల శ్రీని వాసరావు, చాటపర్తి చిట్టయ్య, నల్లపోతుల అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

రోగాలకు నిలయాలు

(1వపేజీ తరువాయి)

వెదజల్లుతోంది. ఖాళీ స్థల యజమానులు ఊర్లోను, మరో విధంగాను అందుబాటులో ఉంటే వారికి నోటీసులు ఇస్తున్నామని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. ఇక అడ్రస్ తెలియని వారి సంగతి సరే సరి. దీంతో వారికి నోటీసులు ఇవ్వలేకపోతున్నామని అధికారులు చెప్పుకొస్తు న్నారు. మున్సిపల్ చట్టం ఏం చెప్తుందంటే.. మున్సిపల్ చట్టం 1955,1981లోని సెక్షన్ 504,596, 639,640, 641 ప్రకారం సమస్యగా మారిన ఖాళీ స్థలాల యజమా నులపై చర్యలు తీసుకునే వీలుంది. పల్లంగా ఉండే ప్రజారోగ్య సమస్యలు సృష్టిస్తున్నట్లు గుర్తించిన పక్షంలో చట్ట ప్రకారం సంబంధిత యజమానులతో మెరక చేయిం చడం, లేదా అధికారులే మెరక చేయించి అందుకు అయ్యే వ్యయాన్ని యజమానుల నుంచి రాబట్టుకునే అధికారం స్థానిక సంస్థలకు ఉంది. ఇక మురుగునీటి కాసారాలుగా మారిన స్థలాలు ఉంటే వాటి యజమానులపై భారీగా జరిమానా విధించే అవకాశం ఉంది. పరిస్థితిని బట్టి అటువంటి స్థలాలను స్వాధీనం చేసుకునే అధికారం సైతం స్థానిక సంస్థలకు ఉంది. పన్నులు వసూలుకే పరిమితం.. పట్టణంలోనూ గ్రామీణ ప్రాంతంలోనూ ఖాళీ స్థలాల యజ మానులపై తీవ్ర చర్యలు తీసుకోవాల్సిన ప్రజారోగ్య విభాగం అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. మున్సి పాలిటీ పంచాయతీలు తమకు పన్నుల ద్వారా రావలసిన ఆదాయం మీదే దృష్టి పెడుతున్నారు అన్న విమర్శలు విని పిస్తున్నాయి. మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు స్థానిక అధికారులు ఖాళీ స్థలాల్లో మెరక చేయిం చాలని, ప్రజా ఆరోగ్యానికి ఇబ్బంది కలగకుండా చూడా లని మున్సిపల్ పంచాయతీ అధికారులు ఖాళీ స్థలాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న వీటిని ఖాళీ స్థల యజమానులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రజా రోగ్య విభాగం వారు ఖాళీ స్థల యజమానులపై కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం కనిపిస్తోంది.

నేరస్థులు సత్ప్రవర్తనతో ఉండాలి

విశాలాంధ్ర - భీమవరం : భీమవరం ప్రత్యేక ఉప కారాగారాన్ని ఆదివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ ఎస్.శ్రీదేవి సందర్శిం చారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ నేరస్తులకు న్యాయవాదులు ఉన్నారా, న్యాయవాదులను పెట్టుకునే ఆర్థిక స్థోమత లేకపోతే మండల న్యాయ సేవా సంస్థ ద్వారా ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. ముద్దాయిలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఆమె సూచించారు. ముద్దాయిలకు జైలులో ఏమన్నా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగితే ఇబ్బందులు లేవని ముద్దాయిలు చెప్పారు. ఒక ముద్దాయి బోర్డుపై వేసిన డ్రాయింగును మెచ్చుకుని ముద్దాయిలు కళలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. అదే విధంగా ప్రతిరోజూ యోగా చేస్తే మానసికంగా ఉల్లాసంగా ఉంటారని ఆమె పేర్కొన్నారు. అనంతరం న్యాయమూర్తి జైలు పరిసరాలను, మహిళా బ్యారక్ ను, సోషల్ ఇంక్యుబేషన్ సెంటర్, ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని పరిశీలించారు. స్టోర్ రూమ్ ను, వంటశాలను తనిఖీ చేసి, భోజనాన్ని స్వయంగా రుచి చూసారు. పరిసరాల్లో వివిధ రకాల మొక్కలను పెంచి మరోసారి వచ్చేటప్పటికీ పచ్చదనంగా ఉండాలని జైలు పర్యవేక్షణాధికారికి సూచించారు. జైలు ఆధ్వర్యంలో నడుపుతున్న పెట్రోల్ బంకును చూసి ప్రసంశించారు. కార్యక్రమంలో న్యాయ సేవా సంస్థ సెక్రటరీ కె.రత్న ప్రసాద్, జైలు సూపరింటెండెంట్ డి.వెంకటగిరి, జైలు న్యాయ సేవా కేంద్రం ఉచిత న్యాయవాది పి.అంబేద్కర్, న్యాయవాదులు కె.జ్యోతి, డి.రవికిరణ్, పారా లీగల్ వాలంటీరు వి.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ ఆశయాలను అనుసరించాలి

సీపీఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర - ఏలూరు : భారతదేశ స్వాతం త్ర్య ఉద్యమంలో అతి చిన్న వయ సులోనే తమ ప్రాణాలను ఉరికొయ్యకు అర్పిం చిన విప్లవ వీరుడు సర్దార్ భగత్ సింగ్ ఆశయా లను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంక టేశ్వరరావు, కామవరపుకోట మండల కన్వీనర్ టీవీఎస్ రాజు యువతకు పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.సర్దార్ భగత్ సింగ్ జయంతి కార్యక్రమాన్ని కామవరపుకోటలో ఆదివారం నాడు జరిపారు. భగత్ సింగ్ చిత్రపటానికి వెంకటేశ్వర రావు టీవీఎస్ రాజు పూలమాలవేసి నివాళులర్పి చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్దార్ భగత్ సింగ్ రాజు గురు సుఖదేవుల 23 సంవ త్సరాల వయస్సులోనే బ్రిటిష్ వారు వ్యతిరేకంగా పోరాడే ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. భగత్ సింగ్ రాజు గురు సుఖదేవుల వేసిన బాటలో యువత సిపిఐ కార్యకర్తలు పయనించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం కామవరపుకోట మండల కార్యదర్శి జి సత్యనారాయణ,జిల్లా నాయకులు గుమ్మడి లక్ష్మీనారాయణ, గోలిమే బాల యేసు,టి రావులమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగత్ సింగ్ జయంతి

విశాలాంధ్ర - కుక్కునూరు: మండలంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏఐఎస్ఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో భగత్ సింగ్ 118వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పాల్గొన్న సీపీఐ కుక్కునూరు మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య మాట్లాడారు. బ్రిటిష్ పాలకుల కబంధ హస్తాల నుంచి భారతదేశాన్ని విడిపించుకో వడంలో అతని చేసిన ప్రాణత్యాగం, సిద్ధాంతాలు ఎందరికో స్ఫూర్తి దాయకమన్నారు.దేశం కోసం పోరాటమే ఊపిరిగా ప్రయాణం సాగించి అతి చిన్న వయస్సులోనే ఉరి తాడును ముద్దాడిన గొప్ప దేశ భక్తుడు, ఆదర్శప్రాయుడు భగత్ సింగ్ అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి సారంగి. శౌర్య, మండల కమిటీ సభ్యులు ప్రేమ్ సాగర్, లక్కీ, మహేశ్, రాము, ప్రదీప్ పాల్గొన్నారు.

ఆర్చరీ పోటీలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల విజయం



విశాలాంధ్ర - చింతలపూడి : గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో పురుషులు, మహిళల విభాగా లలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అంతర కళాశాలల ఆర్చరీ పోటీలు ఈనెల 26న నిర్వహించిన రెండు విభాగా లలోను ప్రభుత్వ డిగ్రీ కళాశాల చింతలపూడి విద్యార్థులు విజేతలుగా నిలిచారు. తదుపరి జరిగిన యూనివర్సిటీ టీం ఎంపికలో ఇద్దరు బాలికలు ,ఇద్దరు బాలురు యూని వర్సిటీ ఆర్చరీ జట్టుకు ఎంపికయ్యారు.ఈ ఎంపికైన యూనివర్సిటీ జట్టు గురుకాసి యూనివర్సిటీ పంజాబ్ లో జరిగే ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ ఆర్చరీ పోటీ లలో పాల్గొంటారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డా.అం జద్ ఆలీ తెలిపారు. చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇటీవల నిర్వహించిన ఆర్చరీ పోటీలలో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. ఈ పోటీలలో విద్యార్థులు తమ ఏకాగ్రత, క్రమ శిక్షణ, శారీరక చురుకు దనం, క్రీడాస్ఫూర్తిని ప్రతిభావం తంగా ప్రదర్శించారు. విద్యార్థులు క్రీడలలో విజయం సాధిం చడం అనేది ఒక విషయం అయితే, రెండవది వ్యాయామ అధ్యాపకులు డాక్టర్ అంజద్ ఆలీ కృషిననీ, క్రమశిక్షణతో కూడిన శిక్షణ అని గర్వంగా చెప్పుకోవచ్చునని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి శ్రీనివాస్ రావు హర్షం వ్యక్తం చేస్తు విద్యార్థులను అభినందించారు. ఈ విజయానికి విద్యార్థుల కృషి, క్రీడా శిక్షకుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహమే కారణమని ఆయన పేర్కొన్నారు.

ప్రయాణం నరకప్రాయం

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం : నిత్యం అనేక మంది ప్రయాణించే బుట్టాయిగూడెం నుండి జంగారెడ్డి గూడెం వెళ్లే ప్రధాన రహదారి అడుగడుగున గుంతల మయమై నరకప్రాయంగా మారింది. గత వైసిపి ప్రభుత్వ హయాం నుండి రోడ్డు నిర్మాణానికి ఎన్నో ఆర్భాటాలు చేసినప్పటికీ నేటికీ ఈ రోడ్డు మరమ్మత్తులకు నోచు కోలేదు. దీంతో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రహదారుల పరిస్థితి మెరుగవుతుందని, ప్రయాణికులు ఆశించినప్పటికీ వారి ఆశలు నిరాశగా మిగిలాయి. ఇటీవల కురిసిన వర్షా లకు పూర్తిగా పాడైపోయి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి నరక ప్రాయంగా మారడంతో, ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు సంబంధిత పంచాయతీరాజ్ అధికారులతో ఆదివారం చరవాణిలో మాట్లాడి రోడ్డు నిర్మాణ పనులపై ఆరా తీశారు. రోడ్డు నిర్మాణ పనుల జాప్యంతో కంకర తేలి, బురద గుంతలు, దుమ్ము, ధూళితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తున్నదని, చాలాచోట్ల రోడ్డు దెబ్బతిని ప్రమాదకరంగా మారిందని త్వరితగతిన బీటీ రోడ్డు పనులు పూర్తి చేయాలన్నారు. ఈ మేరకు పంచా యతీరాజ్ అధికారులు రోడ్డు నిర్మాణానికి రూ.3కోట్ల మంజూరయ్యాయని, వర్షాల కారణంగా నిర్మాణ పనులు నిలిచిపోయాయని వాతావరణం అనుకూలిస్తే వెంటనే పనులు మొదలుపెడతామని సమాధానం ఇచ్చారు.

కూటమి ప్రభుత్వంలోనే రోడ్ల అభివృద్ధి

విశాలాంధ్ర - గణపవరం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అతి ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం నిడమర్రు మండలం చిన నిండ్రకొలను నుండి తోకలపల్లి వరకు నిర్మించిన బీటి రోడ్డును ఎంపీతో కలిసి ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు, రాష్ట్ర ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు బీటీ రోడ్డును ప్రారంభించారు. ఈ రోడ్డు ఎం.జి. ఎన్.ఆర్.ఇ జి ఎస్ నిధులు 1 కోటి రూపా యల అంచనా వ్యయంతో నిర్మించారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వ విధ్వంస పరిపాలనలో నిర్వీర్యమైన అన్ని వ్యవస్థలను పునరుద్ధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పవన్ కళ్యాణ్ తలపెట్టిన పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు నియోజకవర్గ జనసేన, టీడీపీ, బీజేపీ ముఖ్య నాయకులు, నాలుగు మండలాల అధ్యక్షులు, గ్రామాధ్యక్షులు, కార్యకర్తలు, వీర మహి ళలు, తెలుగు మహిళలు, జనసైనికులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జీఎస్టీ మార్పులు, సూపర్ సిక్స్ పథకాల అమలు విజయవంతం

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : రాష్ట్ర ప్రజలు జీఎస్టీ మార్పులు, సూపర్ సిక్స్ పథకాలు అమ లుపై సంతృప్తిగా ఉన్నారని పోలవరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పారేపల్లి రామారావు రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడుకు చరవాణి ద్వారా తెలియ జేశారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సిక్స్ పథకాలు విజయ వంతం అవడంపై రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో ఉన్న ముఖ్య నాయకులతో నిర్వహించిన కాన్ఫరెన్స్‌కాల్‌లో ముఖ్యమంత్రితో రాష్ట్రంలో ఇద్దరు నాయకులకు అవకాశం ఇవ్వడంతో ఇద్దరిలో ఒకరు కొయ్యల గూడెం మండలం బయ్యనగూడెం గ్రామవాసి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, చింతల పూడి నియోజకవర్గ పరిశీలకులు, పోలవరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పారేపల్లి రామారావు కు అవకాశం రావడం పై కొయ్యలగూడెం మండల ప్రజలు నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో జీఎస్టి మార్పులు సూపర్ సిక్స్ పథకాలు అమలుపై ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడుకు వివ రించారు. ఆయన వెంటనే రామారావును అభినం దిస్తూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పట్ల దీనిపై రాష్ట్ర నాయ కులు ప్రజలకు మరింత ప్రచా రం చేయాలని తెలిపామని రామారావు తెలిపారు.

ప్రభుత్వాసుపత్రి పారిశుధ్య కార్మికుల సమ్మె వాయిదా

విశాలాంధ్ర - తణుకు : తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రిలో పనిచేయుచున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ ఈనెల 29 నుంచి జరుపతలపెట్టిన సమ్మె అధికారుల హామీ మేరకు తాత్కాలికంగా సమ్మె వాయిదా వేస్తున్నట్టు ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు కోనాల భీమారావు చెప్పారు. ఆదివారం తణుకు గుత్తు ఆసుపత్రి ఆవరణలో భీమారావు కార్మికులతో కలిసి మాట్లాడుతూ ఆరోగ్య శాఖ జిల్లా అధికారి డీసీహెచ్ఎస్ సూర్యనారాయణ కార్మికుల సమస్యలు అక్టోబర్ 1 తేదీ నాటికి పరిష్కారం చేస్తామని అప్పటి వరకు గడువు కావా లని కోరారని చెప్పారు. దానితో ఈనెల 29 నుంచి తల పెట్టిన సమ్మె కార్మికులతో చర్చించి తాత్కాలికంగా సమ్మె వాయిదా వేసినట్టు భీమారావు చెప్పారు. కార్మికుల నాలు గు నెలలు వేతన బకాయిలు, 40 నెలల పిఎఫ్ బకా యిలు చెల్లించాలని, తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వాసు పత్రి 150 పడకల స్థాయి కనుగుణంగా కనీసం 60 మంది పారిశుధ్య కార్మికులను నియమించాలనే డిమాం డ్స్ పరిష్కారం కోరుతూ సమ్మె నోటీసు ఇచ్చినట్టు భీమా రావు చెప్పారు. అధికారులు ఇచ్చిన గడువు లోగా కార్మి కుల న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోతే అక్టోబర్ 2 నుంచి సమ్మె లోకి వెళ్ళనున్నట్టు భీమారావు చెప్పారు. మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ధర్నాని పుష్పలత, నేకూరి వెంకటలక్ష్మి, పి.విజయలక్ష్మి, సీహెచ్ మంగమ్మ, డి.ప్రసన్న, సూరమ్మ, బేబీ, చింతాలు, లక్ష్మణరావు, మెండి శ్రీను, డి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టి - సూపర్ సేవింగ్స్ విజయవంతం చేయాలి

– ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి

విశాలాంధ్ర - గణపవరం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సూపర్ జీఎస్టి, సూపర్ సేవింగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గణపవరం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఆర్ బేబీ శ్రీలక్ష్మి అన్నారు. ఆదివారం ఎంపీపీ కార్యాలయంలో కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్, ఆదేశాల మేరకు గణపవరం మండలంలో సూపర్ జీఎస్టి - సూపర్ సేవింగ్స్ కార్యక్ర మాలకు, గ్రామాల వారీగా అధికారులను నియ మించినట్లు, ఎంపీడీవో తెలిపారు. నియ మించిన అధికారులు సోమవారం నుండి ప్రతి సచివాలయ పరిధిలో సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, ఇంటింటికి వెళ్లి సూపర్ జీఎస్టీ వినియోగదారులు ప్రజలకు, ముఖ్యంగా నిత్యవసరాలు, వ్యవసాయ పనిముట్లు, ఆరోగ్య భీమా వంటి, వాటిలో తగ్గించిన, టాక్స్ వలన ప్రయోజనాలు, వివరించి కరపత్రాలు పంపిణీ చేయాలని, సచివాలయం వద్ద, బ్యానర్, సరుకులు ప్రదర్శించి, వారం పాటు అవగాహన కల్పించాలని, తెలియజేశారు, ఈనెల 29 నుండి అక్టోబర్ 19 వరకు ఒక నెల రోజులు నిర్వహించే ఈ క్యాంపెయిన్ లో, ర్యాలీలు, వర్క్ షాప్ లు ప్రదర్శనలు, విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు, నిర్వహించాలని, ఆయా గ్రామ సచివాలయాలు పరిధిలోని ప్రజలందరికీ, జీఎస్టి తగ్గింపు వల్ల కలిగే లాభాలను విస్తృతంగా ప్రచారం చేసి, ప్రజలను చైతన్యవంతం చేయాలని, ఎంపీడీవో అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలో ఉన్న గ్రామ కార్యదర్శులు సచివాల సెక్రటరీలు సిబ్బంది పాల్గొన్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు

విశాలాంధ్ర - భీమడోలు : ఉంగుటూరు నియోజక వర్గంలో మూడుకోట్ల రూపాయల వ్యయంతో చేపట్ట నున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే ధర్మరాజుతో కలిసి ఆదివారం శంకుస్థాపనలు చేశారు. స్థానిక ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఏపీ ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్పర్సన్ గంటా పద్మశ్రీ కార్యక్రమంలో హాజరయ్యారు. కార్యక్రమంలో తొలుత భీమడోలు మండలం గుండు గొలను బీసీ కాలనీలో ఉపాధిహామీ నిధులు 70లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు నిర్మాణానికి అదేవిధంగా స్థానిక హౌసింగ్ కాలనీలో రూ.45లక్షలతో నిర్మించ నున్న మెటల్ రోడ్డు పనులకు ఎంపీ పుట్టా మహేష్, ఎమ్మెల్యే ధర్మరాజు కూటమినేతలతో కలిసి శంకుస్థాపన చేసారు. అనంతరం ఉంగు టూరు మండలం కైకరం గ్రామంలో జెడ్పి నిధులు 95లక్షల రూపాయలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు అదేవిధంగా నిడమర్రు మండలం చిననిండ్రకొలను నుంచి తోకలపల్లి వరకు ఉపాధి హామీ నిధులు కోటి రూపాయలతో నిర్మించిన బీటీ రోడ్డు ను ఎమ్మెల్యే ధర్మరాజు, జడ్పీ ఛైర్ పర్సన్ పద్మశ్రీ, గన్ని తో కలిసి ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, సుమారు మూడు కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ఎందుకు నిదర్శనం అని ఆయన పేర్కొన్నారు. కార్యక్ర మంలో ఉంగుటూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ శర ణాలు మాలతీరాణి, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

విశాలాంధ్ర - భీమవరం : శాఖా గ్రంథాలయం అభివృద్ధి కమిటీ చదువరుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యిందని గ్రంథాలయాధికారి ఎస్. హవెంకటేశ్వ రరావు తెలిపారు. అభివృద్ధి కమిటీ అధ్యక్షునిగా డాక్టర్ అల్లూరి నరసింహరాజు, ఉపాధ్యక్షునిగా కలిగొట్ల గోపాల శర్మ, ప్రధాన కార్యదర్శిగా వంక వీర వెంకట నరసింహమూర్తి, సంయుక్త కార్యదర్శిగా అల్లు శ్రీనివాస్, సభ్యులుగా తహశీల్దార్ ఆర్.రాంబాబు, ఎంఇఓ శ్రీని వాసరావు, ఎస్.కె. బాబాజీ సాహెబ్, సురేష్ జైన్, మహమ్మద్ సరోజిని, గ్రంధి కుమార వెంకటేశ్వర్ వర ప్రసాద్, బి.వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారని ఆయన తెలిపారు.

వినుకొండలో గుర్రం జాషువా స్మారక మందిరం నిర్మించాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : అమరావతిలో గుర్రం జాషువా విగ్రహం ఏర్పాటు చేయటంతో పాటు ఆయన జన్మిం చిన గుంటూరు జిల్లా వినుకొండలో స్మారక మందిరం నిర్మిం చాలని బిసి చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెలగల దుర్గారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక శాఖ గ్రంథాలయంలో గుర్రం జాషువా 150వ జయంతిని గ్రంథ పాలకురాలు యు. రాముడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవ జ్యోతిని వెలిగించిన అరుణతార జాషువా అని అన్నారు. కులరహిత సమాజం కోసం నిరంతరం తన రచనల ద్వారా కృషి చేశారని తెలిపారు. నేటి యువత ఆయన ఆశ యాలను ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో సీపీఐ పార్టీ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయ రాజు, మేకల అన్నవరం, రాయపూడి వెంకట రమణ, సచి వాలయ డిజిటల్ ఆపరేటర్ ప్రతాప్, చిటికెన బాలగంగాధర్ తిలక్, జవ్వాది శ్రీను, పంది శ్రీను, సూరి గంగాధర్ రాజు, దాస రోజుశేఖర్, సిబ్బంది సత్యనారాయణ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి

విశాలాంధ్ర - గణపవరం : మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన పువ్వాడ వెంకట సుబ్బా యమ్మ వయస్సు(105) సంవత్సరాలు భర్త పువ్వాడ సుబ్బారావు (లేటు) ఆమె ఆది వారం మృతి చెందినట్లు మనవడు కిషోర్ విలేకరులు తెలిపారు. ఆమెకు రుద్రరాజు ఫౌండేషన్, చైర్మన్ వర్తక సంఘం అధ్యక్షులు రుద్రరాజు వేంకట సూర్యనారా యణ రాజు (ఆర్ వి ఎస్ రాజు), క్రొవ్విడి చేతురామయ్య, చేకూరి మణిబాబు, కైతేపల్లి శ్రీనివాస్, పలువురు సంతాపం తెలిపారు.

గండిగూడెం రోడ్డు అభివృద్ధి చేయాలి

విశాలాంధ్ర- టీ నరసాపురం : టి నరసాపురం పంచా యతీలోని గండిగూడెం రోడ్డు అభివృద్ధి చేసి డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడానికి నిధులు మంజూరు చేయాలని సామాజిక కార్యకర్త ఎస్ డి నాసర్ పాషా ప్రభుత్వాన్ని కోరారు. గండి గూడెం గ్రామంలో స్థానికులతో ఆదివారం సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరా లుగా గండిగూడెం గ్రామానికి చెందిన రోడ్డు ఎవరూ పట్టించు కోకపోవడంతో గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. అత్యవసర పరిస్థితులలో వైద్యానికి టి నరసాపురం, జంగారెడ్డిగూడెం, ఏలూరు, చింతలపూడి అంబు లెన్స్ సైతం సకాలంలో వెళ్ళే పరిస్థితి లేదని అన్నారు. డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగు నీటి నిల్వతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధి కారులు స్పందించి గండిగూడెం రోడ్లకు మోక్షం కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద కొరివి శేషారావు, సామాజిక కార్యకర్తలు కొరివి నాగేశ్వరరావు, పొదిల రామారావు, గ్రామస్తులు బడుగు రాఘవులు, సత్తెనపల్లి నర సయ్య, యాదాల వెంకన్న, చక్రాల నారాయణ పాల్గొన్నారు.

మాన్‌కి బాత్ ప్రత్యక్ష ప్రచారం వీక్షిస్తున్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : ప్రధాని నరేంద్ర మోడీ తీసుకుంటున్న నిర్ణయాలు ఆయన ఇచ్చి పిలుపులు ప్రతి ఒక్కరికి ప్రేరణగా అందిస్తున్నాయని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాల రాజు అన్నారు. ఆదివారం బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాన్ కి బాత్ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రచారం వీక్షించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ మాన్‌కి బాత్ కేవలం ప్రచార కార్యక్రమం మాత్రమే కాకుండా ప్రజలతో నేరుగా ఆలోచనలు పంచుకునే వేదిక అని అన్నారు. పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత, స్వచ్ఛభారత్, యువతకు అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై ప్రధాని ఇచ్చే సందేశాలు ప్రతి ఒక్కరిని ప్రేరేపిస్తున్నాయని అన్నారు. గ్రామీణాభివృద్ధి ,సాంకేతిక వినియోగం, గిరిజన సంక్షేమం వంటి అంశాలకు మోడీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే అన్నారు.

అవగాహనతో రేబీస్ నివారణ

విశాలాంధ్ర - వీరవాసరం : రేబీస్ అనేది కుక్కలు, పిల్లులు, అడవి జంతువుల ద్వారా మనుషులకి వ్యాప్తి చెందుతుందని ఇది ఒక ప్రమాదకరమైన వైరస్ అని, ఒకసారి వ్యాధి వస్తే చికిత్స లేకుండా ప్రాణాంతకం అవుతుందని, అయితే రేబీస్ ని వంద శాతం నివారించవచ్చని వనిత క్లబ్ అధ్యక్షురాలు డా.బి.లక్ష్మీ కళ్యాణి పేర్కొన్నారు. జాతీయ రేబీస్ నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక వనిత క్లబ్ కార్యాలయంలో వీరవాసరం కాపు సర్వీస్ క్లబ్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో రేబిస్ వ్యాధిపై ప్రజలలో అవగాహన పెంచడం, దానిని నివారించడం వంటి చర్యలు గురించి ఆదివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 28 న లూయిస్ పాశ్చర్ వర్ధంతి సందర్భంగా జాతీయ రేబీస్ నివారణ దినోత్సవం జరుపుకుంటున్నామని రేబిస్ నివారణకి కుక్కలు, పిల్లులు, పెంపుడు జంతువులకు తప్పనిసరిగా రేబీస్ వాక్సిన్ వేయించాలని, వీధి కుక్కల నుండి జాగ్రత్త వహించాలని, కుక్కలు, పిల్లులు, కోతులు కరిచినప్పుడు వెంటనే కరిచినచోట రన్నింగ్ వాటర్, సబ్బుతో శుభ్రం శుభ్రం చేసుకుని తర్వాత డాక్టర్ దగ్గరికి వెళ్లి ప్రథమ చికిత్స చేయించుకోవాలని సూచించారు. అనంతరం వ్యాక్సిన్ గురించి సిబ, పోలీస్ సిబ్బందికి, షాపులకు, ప్రజలకు కరపత్రాల అందచేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాపు సర్వీస్ క్లబ్ అధ్యక్షులు గుండా రామకృష్ణ, కార్యదర్శి నాగేంద్ర, కెవిఎల్, జి.సుబ్బారావు, పిజి.ప్రసాద్, సెక్రటరీ విజయలక్ష్మి, ట్రెజరర్ కుంచె వేణు, అల్లంశెట్టి అన్నపూర్ణ, ఎం.అరుణ, తదితరులు పాల్గొన్నారు.

గుర్రం జాషువా "130వ" జయంతి

విశాలాంధ్ర - ఏలూరు : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ, ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆధునిక కవితా పితామహులు, కవి కోకిల,కవితా విశారద, కవిదిగ్గజ, నవయుగకవి చక్రవర్తి, పద్మభూషణ్ గుఱ్ఱం జాషువా "130వ" జయంతి ని ఆది వారం జిల్లా గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ముందుగా కె.ప్రభాకర్ "సెట్ వెల్ సీఈవో" ముఖ్య అతిథిగా పాల్గొని గుఱ్ఱం జాషువా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నగరప్రముఖులు, సామాజిక కార్యకర్త, మానవత స్వచ్ఛంద సేవాసంస్థ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మేతర అజయ్ బాబు, సామాజిక కార్యకర్తలు మాట్లాడుతూ ఆధునిక తెలుగు కవు లలో విశ్వకవి సామ్రాట్‌గా గొప్పస్థానంపేరు పొందినవారిలోగుర్రం జాషువా ఘనులు, ప్రసిద్ధులు. ఈయన1932వ సంవత్సరంలో రచించిన పుస్తకాలలో ఫిరదౌసి, ముంతాజ్ మహల్, 1941లో "గబ్బి లం"అనేరచన ఎంతో ప్రసిద్ధిచెందింది. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవాసంస్థలఅధ్యక్షులు, సామాజిక కార్యకర్తలు, పి.తంబి, డొమినిక్, రెడ్డిబాబు, గణేష్, నరసింహారావు, మిట్టన్, వి.టి సందీప్ కుమార్, జిల్లా కేంద్ర గ్రంథాలయం సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు సెట్ వెల్ సీఈవో కె.ప్రభాకర్ గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని, తరచు గ్రంథాలయానికి వచ్చి విజ్ఞాన వంతులు కావాలని సూచించారు.

1100 సేవలను వినియోగించుకోండి : కలెక్టర్ నాగరాణి

విశాలాంధ్ర - భీమవరం : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. ఆదివారం కలెక్టర్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సోమవారం 28న కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలను మీకోసం. ఏపి.గవ్.ఇన్ వెబ్సైట్‌లో నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

పట్టాల పంపిణీకి ప్రతిపాదనలివ్వండి : జేసీ

విశాలాంధ్ర - భీమవరం : అభ్యంతరంలేని ప్రభుత్వ భూముల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు పట్టాలు మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులు ఆదేశించారు. ఆదివారం భీమవరం మండలం గొల్లవాని తిప్ప గ్రామంలో జాయింట్ కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి అభ్యంతరాలు లేని పోరంబోకు భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అభ్యంతరాలు లేని ప్రభుత్వ పోరంబోకు స్థలాలలో ఇల్లు నిర్మించుకొని నివాసాలు ఉంటున్న వారి వివరాలను అడిగి తెలుసు కున్నారు. లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడి ఇంటి పన్ను, కరెంటు బిల్లు, రసీదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో ఎంఎస్ నెంబర్ 30 ప్రకారం 2019 ముందు ఇల్లు నిర్మించుకుని నివాసాలు ఉంటున్న వారు అందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాల న్నారు. లబ్ధిదారులు ఇంకను ఎవరైనా ఉంటే వివరాలు సేకరించి ప్రతిపాదనలను పంపాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత శాఖల అధికారి లను ఆదేశించారు. ఈ సందర్భంలో ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహసిల్దార్ రావి రాంబాబు, మండల సర్వేయర్, వీఆర్వో సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఘనంగా మేయర్ నూర్జహాన్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర- ఏలూరు : ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు పుట్టినరోజు వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. స్థానిక పవర్ పేటలోని మేయర్ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం జరిగిన వేడుకలకు ముఖ్య అతిథిగా ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య హాజరై కేక్ కట్ చేసి మేయర్ నూర్జహాన్ పెదబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆర్టీసీ రీజనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఈడా చైర్మన్ పెద్దబోయిన శివప్రసాద్, ఏఎంసి చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చల్ల ప్రసాద్, బెల్లంకొండ కిషోర్, ఏలూరు పట్టణ అధ్యక్షులు చోడే వెంకటరత్నం, కార్యదర్శి రెడ్డి నాగరాజు, డిప్యూటీ మేయర్లు పప్పు ఉమా మహేశ్వరరావు, వందనాల దుర్గా భవాని, పలువురు కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు తదితరులు హాజరై మేయర్ నూర్జహాన్ పెదబాబుకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. మేయర్ నూర్జహాన్, ఎస్ఎంఆర్ పెదబాబు దంపతులు తొలుత పవర్ పేటలోని వాసు దేవాలయం అనంతరం శివాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఏ.భాను ప్రతాప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది, ఇంజనీరింగ్ సెక్షన్ సిబ్బంది, మున్సిపల్ ఆఫీస్ అటెండర్లు, డ్రైవర్లు, మున్సిపల్ స్కూల్ స్వీపర్లు, అంగన్వాడి టీచర్లు, ఆయాలు ఆశా వర్కర్లు, క్లాప్ వెహికల్ డ్రైవర్లు, మొదలగు 3000 మందికి నగర పాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్, ఎస్ఎంఆర్. పెదబాబు దంపతులు సొంత ఖర్చుతో కొనుగోలు చేసిన నూతన వస్త్రాలను స్వయంగా అందరికీ అందజేశారు. ఎస్ఎంఆర్ ఫాలోవర్స్, అభిమానులు పవర్ పేటలోని ఎస్ఎంఆర్ భవన్లో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును మేయర్ నూర్జహాన్ పెదబాబు ప్రారంభించారు. తెలుగు దేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జీలు, డివిజన్ ఇన్చార్జిలు, కో-క్లస్టరు ఇంచార్జీలు, మాజీ కార్పొరేటర్లు, తెలుగుదేశం పార్టీ వివిధ విభాగాలకు సంబంధించిన రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయి నాయకులు వివిధ విభాగాలకు సంబంధించిన అనుబంధ సంఘాల నాయకులు, జనసేన నాయకులు, బిజెపి నాయకులు అభిమానుల మధ్య కేక్ కటింగ్ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఉచిత మెగా వైద్య శిబిరాలను గ్రామీణ ప్రాంతాల ప్రజలంతా సద్విని యోగం చేసుకోవాలని రామనుజపురం గ్రామపంచా యతీ సర్పంచ్ అడపా నాగలక్ష్మి పేర్కొన్నారు. రామా నుజపురం, వేదాంత పురం గ్రామాలలో ఆదివారం కష్టం వస్తే కాపు కాస్తం సంగం వైద్య విభా గం అధ్య క్షులు శివశం కర్ ఆధ్వర్యంలో శివ శం కర మల్టీ స్పెషా లిటీ ఆసుపత్రి వారు మెగా మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ సంద ర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ కే 9 కష్టం వస్తే కాపు కష్టం సంగం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబి రాలను గ్రామీణ ప్రజలంతా విని యోగించుకోవాలని, ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్య క్షులు తొమ్మిదేళ్ల శ్రీని వాస్, కార్యదర్శి శీలం కృష్ణ, ట్రెజ రర్ పి. మోహన్, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు పారేపల్లి నరేష్, వేదాంతపురం గ్రామపంచాయతీ సర్పంచ్ జిటిఎస్ రాజు, పరిమి రాంబాబు, సొసైటీ అధ్యక్షుడు కోనె శ్రీను, వీఆర్వో అడపా రాంబాబు, వేదాంతపురం రామనుజపురం గ్రామాల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రేబిస్ అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - భీమవరం : రేబీస్ ప్రమాదకరమని కుక్కలు, పిల్లులు, అడవి జంతువుల ద్వారా మనుషులకి వ్యాప్తి చెందుతుందని చికిత్స లేకపోతే ప్రాణాంతకరం అవుతుందని డి ఎస్ ఓ డాక్టర్ ధనలక్ష్మి, జిల్లా ఎపిడెమియాలజిస్ట్ గాతల సుభాష్ అన్నారు. జాతీయ రేబీస్ నివారణ దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం జిల్లా వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లూయిస్ పాశ్చర్ వర్ధంతి సందర్భంగా జాతీయ రేబిస్ నివారణ దినోత్సవం జరుపుకుంటున్నామని రేబిస్ ను పారద్రోలాలన్నారు. రేబీస్ ని వంద శాతం నివారించవచ్చని, రేబీస్ నివారణకి కుక్కలు, పిల్లులు , పెంపుడు జంతువులకు తప్పనిసరిగా రేబీస్ వాక్సిన్ వేయించాలని , వీధి కుక్కల నుండి జాగ్రత్త వహించాలని , కుక్క కార్చినప్పుడు తక్షణమే గాయాన్ని సబ్బుతో శుభ్రం చేసి దగ్గర్లోని ఆసుపత్రిని సంప్రదించాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఎస్.కె, ప్రసాద్, ఆరోగ్య విస్తరణ అధికారి పి.సుకుమార్ భీమవరం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అసమానతల రూపకర్త జాషువా : గారపాటి

విశాలాంధ్ర - ఏలూరు : సమాజంలో అసమానతలు రూపు మాపి సమానత్వం తీసుకు వచ్చేందుకు గుర్రం జాషువా తన కలం ద్వారా ఎనలేని కృషి చేశారని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. కవికోకిల, పద్మ భూషణ్, కళారత్న, నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి ఉత్సవాన్ని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు చౌటపల్లి విక్రమ్ కిషోర్ అధ్యక్షతన స్థానిక తంగేళ్లమూడి ఇజ్రాయెల్ పేటలోని బాబు జగ్జీవన్ రావు కమ్యూనిటీ హాలులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదోని శాసనసభ్యులు పివి. పార్థసారథి, విశిష్ట అతిథిగా ఏలూరు శాసన సభ్యులు బడేటి రాధాకృష్ణయ్య, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ రీజియన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు హాజరై గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సచివాలయాలలో కాన రాని రుసుము పట్టికలు

- డిజిటల్ సేవల రుసుములపై ప్రజల్లో అయోమయం
- డిజిటల్ అసిస్టెంట్ల కొరతతో ప్రజల ఇక్కట్లు

విశాలాంధ్ర- సీతానగరం: గ్రామ సచివాలయాలలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న డిజిటల్ సేవలపై కాన రాని రుసుముల పట్టిక వివరాలు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో 20 గ్రామ సచివాలయాలలో ప్రజలకు డిజిటల్ అసిస్టెంట్ ద్వారా ప్రజలకు వివిధ రకాల సేవలను అందిస్తున్నారు. 20 సచివాలయాల పరిధిలో 14 మంది మాత్రమే డిజిటల్ అసిస్టెంట్లు తమ సేవలను అందిస్తున్నారు. ఆరు డిజిటల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో ప్రధానంగా పెద్ద పంచాయితీలు అయిన చినకొండేపూడి 1,2, రఘుదేవపురం 1,3 పాటు చిన్న పంచాయతీలు అయినా పురుషోత్త పట్నం, ఉండేశ్వరపురం గ్రామాలలో డిజిటల్ అసిస్టెంట్ల కొరత ఉంది. దీనివల్ల ప్రజలకు ప్రభుత్వ సేవలు అందడంలో గంటల తరబడి నిరీక్షించవలసి వస్తుంది అని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇది ఇలాగ ఉండగా డిజిటల్ సేవలు పై రుసుముల సూచిక పట్టికలు ఏర్పాటు చేయకపోవడం వల్ల ప్రజల్లో నగదు చెల్లింపుల గందరగోళం ఏర్పడుతుంది. ఈ రుసుముల వివరాలను ప్రజలకు తెలిసే విధంగా పట్టికలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.స్వర్ణ పంచాయితీ వేగవంతం చేయడంతో ఇక పై పన్నుల చెల్లింపులు కూడా ఆన్‌లైన్‌లోనే చేయాలి. పంచాయతీల డిజిటలైజేషన్ వలన సచివాలయాల్లో తప్పని సరిగా డీఏల అవసరం ఉంది. కావున ఖాళీగా ఉన్న డిజిటల్ అసిస్టెంట్ల పోస్టులను భర్తీ చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకొని ప్రజలు ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

వృద్ధాశ్రమం లేని సమాజాన్ని నిర్మించాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: వృద్ధాశ్రమం లేని సమాజాన్ని నిర్మించాలి అనే ఆలోచన గొప్పదే ఐనా ప్రస్తుతం ఉన్న సమాజంలో దాని అవసరం లేకపోలేదని గోపాలపురం జనసేన పార్టీ ఇంచార్జ్ డి. సువర్ణ రాజు తెలిపారు. కృష్ణంపాలెం గ్రామంలో ఉన్న వృద్ధాశ్రమంలో రచయితగా పరిచయమవుతూ బందపురం గ్రామస్తులైన పెదవేగి సత్య ప్రకాష్ రాసిన వృద్ధాశ్రమం అనే పుస్తకాన్ని సువర్ణ రాజు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంలో ఆయన పుస్తకాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ రచయితకు వృద్ధాశ్రమం లేని సమాజాన్ని నిర్మించాలి అనే ఆలోచన రావడం చాలా గొప్పదని కొనియాడారు. కానీ ప్రస్తుతం ఉన్న సమాజంలో తనకంటూ తోడుగా ఎవరూ లేని వాళ్ళకి వృద్ధాశ్రమం అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు. ఈ పుస్తకం ద్వారా రచయిత ప్రజలకు తెలియచేయాలి అనుకున్న సందేశాన్ని కచ్చితంగా జనసేన పార్టీ తరపున ప్రజలకు మరింత చేరువా చేస్తామని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు గోపాలపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ డి. సువర్ణరాజు, జనసేన నాయకులు సత్తిబాబు, కవులూరు సత్తిబాబు, రమేష్, బాబీ, గంగరాజు బందపురం గ్రామ సర్పంచ్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారికి జనసేన అండ

విశాలాంధ్ర-దేవరపల్లి: ఆపదలో ఉన్న వారిని జనసేన పార్టీ ఆదుకుంటుందని జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్చార్జ్ దొద్ది గర్ల సువర్ణ రాజు అన్నారు. దేవరపల్లి గ్రామంలో ఇటీవల కాలంలో స్వర్గస్తులు అయిన జన సేన పార్టీ కార్యకర్త కొడమంచిలి సూర్యచంద్రం కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సహాయం క్రింద 12000 వేల రూపాయిలను అందించి పార్టీ వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గోపాల పురం నియోజక వర్గం ఇన్ఛార్జ్ సువర్ణ రాజు, గ్రామ గౌరవ అధ్యక్షులు పసుపులేటి ప్రసాద్, గ్రామ అధ్యక్షులు కంబాల సత్తిబాబు ఉపాధ్యక్షులు కొడమంచిలి శ్రీనుసీని యర్ నాయకులు కొండపల్లి రమేష్ దాసరి శేషారావు మాద వరపు వెంకటేశ్వరరావు ప్రధాన కార్యదర్శి జాజిమొగ్గల శ్రీనివాస్, రైతు విభాగం దుగ్గిన గంగాధర్ నాయుడు సోషియల్ మీడియా సుందర్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

భగత్ సింగ్ నేటి యువతకు స్ఫూర్తి : సీపీఐ

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : సర్దార్ భగత్ సింగ్‌ను నేటి యువత ఆదర్శంగా తీసు కోవాలని సీపీఐ సీనియర్ నాయకులు నల్లా రామారావు, పీఎంపీ జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాస రావు అన్నారు. భగత్ సింగ్ 118వ జయంతి సందర్భంగా స్థానిక రాజేంద్రనగర్ లో భగత్ సింగ్ విగ్రహం వద్ద జయంతిని ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ విగ్రహానికి సీపీఐ సీనియర్ నాయకులు నల్లా రామారావు, నల్లా భ్రమరాంబ, పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావులు పూలమాలతో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నల్లా రామారావు మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో భగత్‌సింగ్ పాత్ర మరవలేని దని, భగత్‌సింగ్ దేశం కోసం ప్రాణ త్యాగం చేశారని కొనియాడారు.బళ్ళా శ్రీనివాసరావు మాట్లాడుతూ భగత్‌సింగ్ 1907 సెప్టెంబర్ 28న బంగా అనే గ్రామంలో జన్మించారని, 23 సంవత్సరాల వయస్సులోనే దేశం కోసం ప్రాణా లర్పించిన భగత్ సింగ్ త్యాగనిరతి నేటి యువతకు స్ఫూర్తి అని అన్నారు. ప్రతీ ఏడు జయంతిని వర్ధంతిని నిర్వహిస్తున్న నల్లా రామారావు,నల్లా భ్రమరాంబ దంపతులను అభినందించారు. బొట్టా వీరబాబు, కేటీ శ్రీనివాస్, కొడమటి బవ్రాజు, పేర్ని నూకరాజు, కొణపల కుబ్రహ్మణ్యం, గుంటముక్కల కుమార్ వేగు, కొండపల్లి ప్రసాద్, కర్రా మురళి, గుత్తి నాగు,జెట్టి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

వర్ధమాన కవులకు స్ఫూర్తి "గుర్రం జాషువా" సాహిత్యం

విశాలాంధ్ర-కడియం : ఆధునిక సాంఘిక, సామాజిక అంశాలను వెలిగెత్తి చూపించడానికి గుర్రం జాషువా సాహిత్యం ఒక మార్గదర్శకమని జనవిజ్ఞాన వేదిక పర్యావరణ రాష్ట్ర కో కన్వీనర్ చిలుకూరి శ్రీనివాసరావు, చెళ్లపిళ్ల కమిటీ అధ్యక్షులు అడపా సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం కడియం గిరజాల కృష్ణ ప్రసాద్ కళ్యాణ మండపంలో జాషువా 130వ జయంతి వేడుకలు నిర్వహించారు. చెళ్లపిళ్ల వేంకట శాస్త్రి కళాసేవా సమితి, జన విజ్ఞాన వేదిక, అరసం సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జాషువా, భగత్ సింగ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. దేవరపు నీలకంఠరావు, గొల్లపల్లి సత్యనారాయణ, తోరాటి వసంతరావు మాట్లాడుతూ జాషువా రాసిన 'నా కథ' పుస్తకంలోని, వారి కుమార్తె హేమలత లవణం రాసిన 'మా నాన్న' పుస్తకంలోని ఆనాటి సామాజిక పరిస్థితులు ప్రస్ఫుటంగా కనిపిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున రావు, తాతారావు, తమ్మిశెట్టి ప్రసాద్, నిశ్చల్, శీలం సుబ్బారావు, ఆకుల సూర్యనారాయణ, కొత్తూరి కృష్ణ, ప్రముఖ కవి గండి స్వామి ప్రసాద్ కి గుర్రం జాషువా పురస్కారం అందించి సత్కరించారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి వేడుకలు

విశాలాంధ్ర-కొవ్వూరు : మహాకవి గుర్రం జాషువా జయంతి సందర్భంగా ఆదివారం కొవ్వూరులో ఎల్ఐసి కూడలిలో ఉన్న గుర్రం జాషువావిగ్రహం వద్ద జయంతి వేడుకలు ముప్పిడి విజయరాం ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమానికి కొవ్వూరు పట్టణంలో గల వివిధ రాజకీయ పార్టీల నాయకులు వివిధ వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని గుర్రం జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దిసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణా, మాట్లాడుతూ కత్తికన్నా కలం గొప్పదని నటిసమాజంలో పేరుకుపోయిన సామాజిక అణచివేతలపై అక్షర కొరడాను ఝుళిపించిన మహోన్నత పండితుడు గుర్రం జాషువా అని ఆయన సాహితీ సేవలను కొనియాడారు. బీజేపీ రాష్ట్ర నాయకులు పరిమి రాధాకృష్ణ మాట్లాడుతూ విద్యను సంపాదించడం ద్వారా ఏ వ్యక్తి అయినా ఉన్నత శిఖరాలు అధిరోహించగలడని గుర్రం జాషువ జీవితం అందుకు నిదర్శనమని వివరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు చామర్తి విశ్వనాథం గుర్రం జాషువా పద్యాలను ఆలపించారు, ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పెనుమాక జయరాజు, ముదునూరి నాగరాజు, చిట్టూరి అన్నవరం, పిల్లలమర్రి మురళీకృష్ణ, కొడమంచిలి విజయకుమార్ కారుపాటి జైహింద్, కొప్పాక జవహర్, పాల్గొన్నారు.

శ్రీ మహా చండీ దేవి అవతారం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలంలో దేవీ నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఆదివారం శ్రీ మహా చండీ దేవి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు దేవరపల్లి బాలదుర్గమ్మ ఆలయంలో ఆదివారం ఉదయం ఆలయ అర్చకులు అఖండం వంశీ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ కోశాధికారి కామిశెట్టి దుర్గారావు శిరోమణి దంపతులు పూజలు నిర్వహించారు అనంతరం 108 లీటర్ల ఆవు పాలు పెరుగుతో అమ్మవారికి అభిషేకాలు చేశారు. అనంతరం ఘనంగా మహా చండీ హోమం నిర్వహించారు. దేవరపల్లిలో సౌభాగ్య దుర్గంబిక ఆలయం వద్ద అమ్మవారు మహా చండీ దేవి అవతారంలో దర్శనం ఇచ్చారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించిన
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకి కృతజ్ఞతలు

- నవంబర్‌లో విజయవాడలో వేలాది మందితో విజయోత్సవ సభ
- ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బొబ్బిలి వెంకటరాజు మాదిగ

విశాలాంధ్ర-గోపాలపురం : మూడు దశాబ్దాల పోరాటంతో ఎంతో మంది అమరవీరుల ప్రాణ త్యాగాలు ఫలితంగా ఈ వర్షాకాల శాసనసభ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కి, ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ కి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని ఉప్పరగూడెం గ్రామంలో ఏర్పాటుచేసిన ఎమ్మార్పీఎస్ కార్య కర్తల సమావేశంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లు ద్వారా రాష్ట్రంలో అనేకమంది మాదిగ మాదిగ ఉప కులాల నిరుద్యోగులకు ఉద్యోగంతోపాటు ఉపాధి కలుగుతుందని ఆయన అన్నారు. అన్ని రంగాలలో ఈ వర్గీకరణ ద్వారా మంచి అవకాశాలు వస్తాయని ఆయన చెప్పారు. వర్గీకరణ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. నవంబర్ నెలలో విజయవాడలో రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ ఆధ్వర్యంలో వేలాది మందితో విజయోత్సవ కృతజ్ఞత సభ నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. ప్రతి విద్యార్థి ఉన్నతమైన విద్య ద్వారా మాత్రమే మంచి భవిష్యత్ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు ప్రతిపాటి రాంబాబు, ఉమ్మడి జిల్లాల ఇన్చార్జ్ గల్లా శ్రీనివాస్, ఏపీ ఎమ్మార్పీఎస్ గోపాలపురం మండల అధ్యక్షులు వీసపల్లి నవీన్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ప్రతిపాటి సూరజ్, తానేటి రాజేష్, అయినపర్తి రాజశేఖర్, సురేష్, క్రాంతి, బల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం అందజేత

విశాలాంధ్ర- తాళ్ళపూడి: ఎదిగిన కొడుకు కళ్లెదుటే, కదల లేని స్థితిలో ఉండడంతో పాటు హీమోఫిలియాతో నిత్యం నరక యాతన అనుభవిస్తున్న బాధను చూసి తల్లిదండ్రులు తల్లడిల్లి పోతున్నారు. ఉన్న ఇంటిని అమ్మినా చాలకపోవడంతో, ఆర్థిక పరిస్థితి బాగా లేక అప్పులుచేసి, ఇక పూర్తిస్థాయిలో వైద్యం అందించలేని స్థితిలో ఉన్నారు. ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తు న్నారు. తాళ్లపూడి మండలంలోని వేగేశ్వరపురం గ్రామానికి చెందిన గుండే పల్లి వీరవెంకట సునీల్ కుమార్ చిన్నతనం నుంచి హీమోఫిలియా అనే రక్తస్రావ వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యంగా ఒక్కో ఇంజక్షన్స్ రూ. 4వేలు నుంచి 5 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీ హాస్పిటల్ ఉచితంగా చేస్తున్నా, స్టాక్ లేనపుడు వేలాది రూపాయలు అవసరమవుతున్నాయి. తన కుమారుడి వైద్యానికి సుమారు 20 లక్షలకు పైగా ఖర్చు చేసారు. తనతల్లి చిన్నటిఫిన్ సెంటర్ నడుపుతుంది. వైద్య ఖర్చులకు దాతలు ఎవరైనా ముందుకు వచ్చి ఆర్థిక సహకారం అందిస్తారని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. ఈ నేపథ్యం లోనే వేగేశ్వరపురంలోని కేస్‌ఆర్ ప్రభుత్వ ఉన్నతపాఠశాల పూర్వవిద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సునీల్‌కు అత్యవసర మందులు, వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 17 వేలు అందజేసారు. పూర్వ విద్యార్థి సంఘం సభ్యులు, దాతలు రిటైర్డ్ ప్రొఫెసర్ కైగాల సుబ్బారావు రూ.5వేలు, శీర్ల సత్యనారాయణ రూ.5 వేలు, వి నాగలక్ష్మి రూ.5 వేలు గుత్తికొండ సూర్యనారాయణ మూర్తి రూ.1000, కారింకి సూర్యనారాయణ మూర్తి రూ.1000 మొత్తం రూ.17 వేలను పూర్వ విద్యార్థి సంఘం సభ్యులు అద్దాల డేవిడ్‌రాజు, మారిశెట్టి సత్యనారాయణ తదితరులు వెళ్లి ఆర్థిక సాయం అందజేశారు.

అదిత్య యూనివర్సిటీ ఫోరెన్సిక్ మేగజైన్ -"ఫోరెన్సిక్స్" సంచిక విడుదల

విశాలాంధ్ర-గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీకి చెందిన ఫోరెన్సిక్ కళాశాల భారతదేశపు మొట్టమొదటి ద్వైమాసిక ఫోరెన్సిక్ సైన్స్ మేగజైన్ అయిన 'ఫోరెన్సిక్స్' యొక్క మొదటి సంచికను పెద్దాపురంలోని డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ), డి హరి రాజు విడుదల చేశారు. అదిత్య యూని వర్సిటీ, డిపార్ట్మెంట్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్స్ స్కూల్స్ ఆఫ్ సైన్సెస్, అసోసియేట్ డీన్, మరియు మ్యాగజైన్ చీఫ్ ఎడిటర్ విలాస్ అనిల్ చవాన్, అసిస్టెంట్ ప్రొఫెసర్, పీవీ నాగేశ్వర రావు, బి ఉదయ్ నాథ్ పాల్గొన్నారు. అదిత్య యూనివర్సిటీ ఆఫ్ ఫోరెన్సిక్ అండ్ సైబర్ సెక్యూరిటీ, సూరంపాలెం వారు ప్రచురించిన ఈ మేగజైన్లో డీఎన్ఏ ఫోరెన్సిక్స్, డీప్‌ఫేక్ ఆడియో & వీడియో, సైబర్ క్రైమ్ వంటి అనేక విభాగాలకు సంబంధించిన అధునాతన పరిశోధనలతో పాటు, విద్యార్థులు, పరిశోధకుల రచనలు చోటు చేసుకున్నాయి.

డీఎస్సీ సెలక్షన్స్‌లో దళిత నిరుద్యోగులకు అన్యాయం

విశాలాంధ్ర - అమలాపురం : ఇటీవల జరిగిన డీయస్సీ సెలక్షన్ కమిటీలో అభ్యర్థులను (విజేత లుగా) నిర్ణయించడంలో లోపభూయిష్టంగా జరిగిందని, రాష్ట్రవ్యాప్తంగా సెలక్షన్ కమిటీ మెరిట్లో వచ్చిన ఎస్సీ అభ్యర్థులను కూడా ఎస్సీ రిజర్వేషన్‌లో నియమించడం అనేది విద్యాశాఖ చేసిన లోపభూయిష్టమైన చర్య, ఆ విధంగా జరగటం వల్ల ఎస్సీ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయారనీ దళిత నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఈ పద్ధతి భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ఎస్సీ రిజర్వేషన్ సెలక్షన్ను గొడ్డలిపెట్టు. ఈ సెలక్షన్ రాజ్యాంగ విరుద్ధం. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి చూస్తే ఇదే ప్రథమం. ఉదా : 100 ఉద్యోగాలు ఉంటే 50% ఉద్యోగాలను కులాలకు అతీతంగా ఓపెన్ కేటగిరిలో భర్తీ చేయాలి. ఇది నిబంధన. కానీ డీయస్సీ సెలక్షన్ కమిటీలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఓపెన్ కేటగిరికి చెందే విధంగా ఎక్కువ మార్కులు సంపాదించినప్పటికి వారిని రిజర్వుడు కేటగిరిలోనే కేటాయించడం చాలా అన్యాయం. చట్టవిరుద్ధమని వారు ఆందోళన చెందుతున్నారు. బీసీ అభ్యర్థులను వారి రిజర్వేషన్లలో సెలక్ట్ అయిన అభ్యర్థులను ఓపెన్ కేటగిరిలో చూపించారు. కానీ ఎస్సీ, ఎస్టీ వారిని ఓపెన్ కేటగిరిలోనికి తీసుకోకుండా ప్రభుత్వం అన్యాయం చేసిందనీ వారు కన్నీరుమునీర్ అవుతున్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులను ఖచ్చితంగా ఓపెన్ కేటగిరిలోనికి తీసుకోవాలి. లేకపోతే దీనిపై చట్టపరంగా న్యాయ పోరాటం చేస్తామని ఆర్‌పిఐ రాష్ట్ర అధ్యక్షులు డిబి లోక్ డిమాండ్ చేశారు. ఆదివారం అమలాపురం బుద్ధవిహార్లో ఉదయం 10గం.లకు డియస్సీ అభ్యర్థుల ఎంపికకు అన్యాయానికి గురియైన అభ్యర్థుల సమావేశం జి గోపాలకృష్ణ అధ్యక్షతన జరిగింది. ములపర్తి సత్యనారాయణ, ఎక్స్ సర్పంచ్, కాశీ వెంకటేశ్వరరావు, ఎంప్లాయిస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, చిలకపాటి సాంబశివరావు, హేండ్లూమ్స్& టెక్స్‌టైల్స్ డిపార్ట్మెంట్ యూనియన్ అధ్యక్షులు, కోడూరి రామ్మూర్తి, బుద్ధ విహార్ కార్యదర్శి, దోనిపాటి నాగేశ్వరరావు, బుద్ధవిహార్ ఎగ్జిక్యూటివ్ మెంబర్, యన్‌పి రమణయ్య, గోసంగి సంపతరావు, నాగబత్తుల రాము, లీడర్, నాగాబత్తుల రామారావు, గోసంగి వెంకట సుధీర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేగుళ్ల సహకారంతో ఎల్ఒసీ అందజేత

విశాలాంధ్ర-మండ పేట : కపిలేశ్వరపురం మండలం మాచర గ్రామానికి చెందిన గుబ్బల శ్రీనివాసు అనారోగ్య ంతో బాధపడుతూ హాస్పట ల్‌లో చూపించగా అక్కడి వైద్యులు రూ. 16లక్షలకు ఎస్టిమేషన్ వేయటంతో ఇతను నిరుపేద కుటుంబానికి చెందినవాడు కావటం వలన ఆర్థిక సహాయం కోసం రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ఆశ్రయించారు. ఆయన మానవతా దృక్పదంతో స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ. 9లక్షలకు ఎల్ఒసిని మంజూరు చేయించారు. ఎల్ఒసిని ఆదివారం మండపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో భాదిత కుటుంబానికి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా భాదిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఆర్ధిక సహాయం అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, అందుకు సహకరించిన ఎమ్మెల్యే వేగుళ్ళకు రుణపడి ఉంటామని తెలిపారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుడాల జయ బాబు, గొడవర్తి సత్యనారాయణ, కోన భగవాన్, అడపా సత్తిబాబు, వనుం సుబ్బారావు, జుత్తుగ శ్రీనివాసరావు, గుత్తుల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఆదిత్య యూనివర్సిటీలో దసరా సంబరాలు

విశాలాంధ్ర-గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీకి చెందిన ఫార్మసీ కళాశాల విద్యార్థులు దసరా పండుగ సందర్భంగా నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతి సంప్రదాయాలను వివరిస్తూ పలు రకాల కార్యక్రమాలు నృత్యాలు విశేషంగా అలరించాయి. విద్యార్థులు సిబ్బంది సంప్రదాయ వేషధారణతో దుర్గా మండపం ఏర్పరచి పూజా కార్యక్రమాలు నిర్వహించి పలు రకాల పిండివంటలతో ప్రసాదాలు సమర్పించారు. డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా ఎం శ్రీనివాస రెడ్డి, ఫార్మసీ డీన్ డా డి సతీష్ కుమార్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకటన

అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం కూనవరం పంచాయతీ డోర్ నెంబర్ 2-73/1 కాపురస్తులు **ఆకుల కోటి వెంకటేశ్వరరావు, తండ్రి వెంకటరత్నం** నా పేరు మీద ఉన్న **డాక్యుమెంట్ నంబర్ 2269/2021గా** రిజిస్టర్ ఒరిజినల్ డాక్యుమెంట్ జిరాక్స్ నిమిత్తం **3-9-2025 తేదీన** నా బైక్‌పై ఎస్ఎస్ నాయుడు మోడరన్ సిటీ నుండి నా యొక్క మోటార్ సైకిల్ వెనుక ఒరిజినల్ దస్తావేజు తగిలించుకొని అమలాపురం పట్టణంలోని నల్ల వంతెన సెంటర్లో జిరాక్స్ కోసం నా బ్యాగులో చూడగా ఒరిజినల్ దస్తావేజు పడిపోయినది అంతట చుట్టుపక్కల వారందరిని అడుగగా ఎవరికి దొరకలేదని చెప్పి ఉన్నారు కావున ఎవరైనా దయఉంచి నాకు డూప్లికేట్ దస్తావేజు ఇప్పించవలసిందిగా కోరి ప్రార్థించుచున్నాను.

ఆకుల కోటి వెంకటేశ్వరరావు
తండ్రి వెంకటరత్నం,
కూనవరం పంచాయితీ, ఉప్పలగుప్తం మండలం

సిమెంట్ బల్లలు ఏర్పాటు

విశాలాంధ్ర-ఆత్రేయపురం : ప్రయాణికుల సౌకర్యం కోసం ఏవీఆర్‌వి చారిటబుల్ ట్రస్ట్ ముందడుగు మండల కేంద్రంలోని ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఏవీఆర్‌వి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆత్రేయపురం కాలవరేవులో సిమెంట్ బల్లలను ఏర్పాటు చేశారు. రాజమండ్రి తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సుల కోసం ఆత్రేయపురం, తాడిపూడి, వసంతవాడ గ్రామాల ప్రజలు ఇక్కడ బస్సులు ఎక్కేందుకు ఎక్కువగా చేరుతుంటారు. బస్సులు ఆలస్యమైతే ఎదురుచూసే ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండగా, కూర్చునేందుకు వీలుగా ట్రస్ట్ చైర్మన్ అల్లం వరప్రసాద్ ఈ సదుపాయం కల్పించారు.

రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్‌కు శుభాకాంక్షలు

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : ఆంధ్రప్రదేశ్ బీసీ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన రెడ్డి అనంతకుమారి, రాష్ట్ర టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం దంపతులను కొత్తపేటలో వారి స్వగృహంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ నూతనంగా కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతకుమారి సాలువతో సత్కరించి సత్కరించారు. ప్రజాసేవా వేదికగా నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న తీరు అందరికీ ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సుబ్రహ్మణ్యం దంపతులు సాలువాతో సత్కరించారు.

వైసీపీ డిజిటల్ బుక్‌తో చర్యలు తప్పవు : పితాని

ముమ్మిడివరంలో డిజిటల్ బుక్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-కాట్రేనికోన : కూటమి ప్రభుత్వంలో ప్రజలను భయభ్రాంతులను చేసే విధంగా తప్పుడు రెడ్ బుక్‌ను అమలు చేస్తోందని, మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించిన డిజిటల్ బుక్‌లో కార్యకర్తలు, ప్రజలు తమ సమస్యలు జరిగిన అన్యాయాన్ని నమోదు చేసుకుంటే రానున్న వైసీపీ పాలనలో విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామని వైయస్సార్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ హామీ ఇచ్చారు. ఆదివారం ముమ్మిడివరం వైసిపి పార్టీ కార్యాలయంలో డిజిటల్ బుక్‌ని ఆవిష్కరించారు. ఏ కార్యకర్త నాయకునికి అన్యాయం జరిగినా క్యూఆర్ కోడ్ ద్వారా ఈ బుక్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని పితాని కోరారు. మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో వైసీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. అక్రమ కేసులను, వేధింపులను డిజిటల్ బుక్ ద్వారా గుర్తించి భవిష్యత్తులో ఇందుకు బాధ్యులైన ఏ అధికారిని వదిలిపెట్టేది లేదని ఆయన హెచ్చరించారు. తప్పు చేస్తే శిక్షించాలి గాని కక్ష సాధింపు చర్యలతో అమాయకులపై కేసులు పట్టడం తగదని పొన్నాడ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ నాయకులు చెల్లుబోయిన శ్రీను, మున్సిపల్ చైర్మన్ కమిడి ప్రవీణ్, జడ్పిటిసి కుడిపూడి శంకరరావు, పెనుమత్స చిట్టి రాజు, వైసీపీ మహిళా నాయకురాలు కాశి బాల ముని కుమారి, జడ్పిటిసి నేల కిషోర్, సీనియర్ వైసిపి నాయకులు పెయ్యిల చిట్టిబాబు, కాశి రామకృష్ణ, చొల్లంగి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కవి స్వామి ప్రసాద్‌కి మహాకవి జాషువా పురస్కారం

విశాలాంధ్ర - మండపేట : మహాకవి, కవి కోకిల గుర్రం జాషువా 130వ జయంతి మరియు భగత్ సింగ్ 119వ జయంతి సందర్భంగా కడియం గ్రామంలోని గురజాల కృష్ణ ప్రసాద్ కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన మహనీయుల జయంతోత్సవ కార్యక్రమంలో మండపేట పట్టణానికి చెందిన గంధి స్వామి ప్రసాద్‌కు చెల్లెపిల్ల కళా సేవా సమితి తూర్పుగోదావరి జిల్లా వారు మహాకవి గుర్రం జాషువా సాహితీ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షులు అడపా సుబ్రహ్మణ్యం ప్రధాన కార్యదర్శి చిలుకూరి శ్రీనివాసరావు, తెలుగు విశ్వవిద్యాలయ విజిటింగ్ ప్రొఫెసర్ దేవవరపు నీలకంఠ రావు చేతుల మీదుగా స్వామి ప్రసాద్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. స్వామి ప్రసాద్‌ను జన విజ్ఞాన వేదిక నవ్యాంధ్ర రాష్ట్ర ప్రథమ అధ్యక్షులు డాక్టర్ చల్లా రవి కుమార్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర పర్యావరణ కమిటీ కన్వీనర్ కేవివి సత్య నారాయణ, భగత్ సింగ్ సేవాసమితి అధ్యక్షులు తమ్మిశెట్టి ప్రసాద్, లాయర్స్ అసోసియేషన్ నాయకులు తోరాటి వసంతరావు,మండల అధ్యక్షుడు గొడవర్తి సుధాకర్, విశ్వసాహితి కళావేదిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు నక్కిన వీర రాఘవరావు, గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు చినబాబు అభినందించారు.

గోదావరి ప్రవాహం ఎక్కువగా ఉంది...
ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ: గోదావరి నీటి ప్రవాహం చాలా ఎక్కువగా ఉన్నందున గోదావరి పుణ్య స్నానాలు ఆచరించేందుకు వచ్చే ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) హెచ్చరించారు. శనివారం పుష్కరాల రేవు వద్ద గోదావరి నదిలో స్నానం చేసేందుకు దిగి ఇద్దరు యువకులు గల్లంతైన నేపథ్యంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆదివారం నగర పాలక సంస్థ, ఇరిగేషన్ అధికారులు, పోలీసులు, టీడీపీ నాయకులతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. జరిగిన ఘటన చాలా దురదృష్టకరమన్నారు. ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గోదావరి నీటి ప్రవాహం తగ్గే వరకు ఎవరినీ పుష్కరాల రేవులోనికి అనుమతించవద్దని, ఆ మేరకు రేవు బయట హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని ఇరిగేషన్, నగర పాలక సంస్థ అధికారులను ఆదేశించారు. అలాగే స్నానాలు నిమిత్తం రేవుకు వచ్చే భక్తులను నియంత్రించేందుకు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు నిత్యం పోలీసులు పహారా కాయాలని త్రీ టౌన్ పోలీసులను ఆదేశించారు. పరిస్థితిని అర్థం చేసుకుని ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కోరారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు.

ఆక్వా చెరువుల వద్ద మత్స్యకార మహిళల ధర్నా

» పెద్దల ముసుగులో దోపిడీను ఆరికట్టి తమ పట్టాలు తమకు ఇప్పించాలని డిమాండ్

విశాలాంధ్ర - అమలాపురం /అల్లవరం : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం కొమర గిరిపట్నం శివారు సక్కా రామేశ్వరంలో మత్స్య కారులు, మహిళలు డి పట్టా భూముల్లో తవ్విన ఆక్వా చెరువుల వద్ద ఆందో ళనకు దిగారు. మా పొట్ట కొట్టవద్దు మా పట్టాలను మాకు ఇప్పించాలంటూ నిరసన తెలిపారు. 1994లో అప్పటి ఆర్డీవో ఉషారాణి నేతృత్వంలో ప్రభుత్వం 1662 సర్వే నెంబర్లో తమ గ్రామంలోని 58 మందికి డీ పట్టా ఎక్సెల్ లీజ్ కింద భూములు ఇచ్చారని, ఆనాటి నుంచి పెద్దలు తమ వద్ద పట్టాలను లాక్కుని అనధికారికంగా ఆక్వాచెరువులు తవ్వించి కనీసం లీజు ఇవ్వకుండా తమకు అన్యాయం చేస్తున్నారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పట్టాలను బలవంతంగా లాక్కుని పేర్లుకూడా మార్చేశారని అనుమానాలున్నా యని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వం ఆ ప్రభుత్వ పెద్దలను లోబర్చుకుని తమ భూములు తమకు దక్కకుండా నేటికీ అన్యాయం చేస్తున్నారన్నారు. తమ గ్రామంలోనే కొందరు పెద్దలు ఆక్వా చెరువుల లీజుసొమ్మును స్వాహా చేస్తు న్నారన్నారు. దీనిపై పలుసార్లు జిల్లా గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తున్నప్పటికీ పట్టిం చుకోవడం లేదని మండిపడ్డారు. దీనిపై జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని కొందరి కబంద హస్తాల్లో ఉన్న తమ భూములను, పట్టాలను తమకు ఇప్పిం చాలని వారు డిమాండ్ చేశారు. మత్స్యకార నాయకుడు చెక్కా ఆంజనే యులు, పంతాడి సత్యనారాయణ, అంగాడి విష్ణు, మల్లాడి నరేష్, అంగాడి గోవిందు, కొపనాతి కాళికేశ్వరి, కర్రి ధనలక్ష్మి, అంగాడి అన్నపూర్ణ, వైదాడి ధనలక్ష్మి, మాంగాయమ్మ, పలువురు మహిళలు ఈ ఆందోళనలో పాల్గొన్నారు.

దుర్గమ్మ అభయం ప్రజలందరిపై ఉండాలి

ఆలయ కమిటీ సభ్యులకు రూ.5 వేలు విరాళం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : శరన్నవరాత్రి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న ప్రజలు, భవాని భక్తులపై దుర్గమ్మ అభయం ఎల్లవేళలా ఉండాలని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి నేత, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళి కృష్ణం రాజు అన్నారు. మండలంలోని శరభవరం గ్రామంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయ కమిటీ ఆహ్వాన మేరకు బోనాలు కార్యక్రమంలో మురళి రాజు పాల్గొన్నారు. మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారి బోనాలు తలపై ఎత్తుకుని గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహిం చారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులకు ఎంఎంఆర్ ట్రస్ట్ నుంచి రూ.5 వేలు విరాళం అందించారు. ఈ సందర్భంగా మురళి రాజు మాట్లా డుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామస్తులంతా కలిసి చేసుకోవడం ద్వారా మంచి వాతావరణం నెలకొంటుంది అన్నారు. అలాగే ప్రజల్లో శాంతి వెల్లువిరిస్తుందన్నారు. అనంతరం మురళి రాజును వైఎస్ఆర్ సీపీ నాయకులు సాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి గ్రామ సీనియర్ నాయకులు రంగనాథం అబ్బాయి, ఎంపీటీసీ అమరాది కాశీ, రాందేవ్ తమ్మారావు, రాందేవ్ రాంబాబు, పడవాడా అమ్మిరాజు, అమరాది రాజా, రంగనాథం లోవరాజు, జువ్వల దొరబాబు, పోకనాటి వెంకటేశ్వర రావు, గ్రామ ప్రజలు, భవాని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కరపలో బౌద్ధ ధమ్మ సొసైటీ కమిటీ ఏర్పాటు

విశాలాంధ్ర - కరప : త్రిరత్న బౌద్ధ ధమ్మ సొసైటీ వ్యవస్థాపకులు ధమ్మా చార్య పొలుగుమాటి నరసింహమూర్తి ఆధ్వర్యంలో కరపమండల త్రిరత్న బౌద్ధ ధమ్మ సంఘం కమిటీ ఏర్పాటు చేశారు. ముందుగా గిడ్ల వీర ప్రసాద్ బుద్ధవందనం చేయగా, విశాలాంధ్ర విలేఖరి అంబేద్కరీయులు సాదే వీరరాఘవులు బుద్ధుని ప్రతిమకు పుష్పమాల వేసారు. కరప మండల త్రిరత్న బౌద్ధ ధమ్మ సంఘం ప్రెసిడెంట్‌గా మాతా అప్పారావు, వైస్ ప్రెసిడెంట్‌గా మారేళ్ల రామకృష్ణ, సెక్రటరీగా సాంబత్తుల రఘువర్మ, ట్రెజరర్‌గా ఇజ్జిన లోవరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సిద్ధబత్తుల అర్జున్, మెంబర్లుగా డి శ్రీనివాసరావు, కొప్పుల సూరిబాబు, జెల్లా శివకుమార్, వీడియ వెంకటేష్, అర్జున్ ఎన్నుకున్నారు. ఈ యొక్క కార్యక్రమంలో కమర్షియల్ టాక్స్ అధికారి సాంబత్తుల వెంకట్రావు, రిటైర్డ్ పోలీసు అధికారి పేరేళ్ల చంద్రరావు, రచయిత సవిలే రాజేష్, జక్కుల ప్రసాద్ బాబు, వినకోటి ధమ్మ ప్రసాద్, పినిపే నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాజమండ్రిని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడానికి కృషి : రవినాయుడు

విశాలాంధ్ర-రాజమండ్రి సిటీ : రాజమండ్రిని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడానికి తన సహాయ సహ కా రాలు అందిస్తానని శాప్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్) చైర్మన్ ఎ. రవినాయుడు అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక నారాయణపురం లోని సిటీ బ్యాడ్మింటన్ కోర్టులో యోనెక్స్ సన్ రైజ్ ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ పోటీలు-2025 ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాబోయే ఖేలో ఇండి యాలో భాగంగా క్రీడలను రాజమండ్రిలో నిర్వహిం చడానికి తాను చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ, రాజమండ్రిలో జాతీయ స్థాయి పోటీలు నిర్వహించడం ఆనందదాయకమ న్నారు. రాజమండ్రి నగరంలో జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడానికి అవసరమైన అన్ని సదుపాయాలున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇది రెండో అతి పెద్ద ఈవెంట్ అని, రాజమండ్రి నగరంలో జాతీయ క్రీడలు నిర్వహించడానికి అన్ని సదుపాయాలుండడం వల్ల రాజమండ్రిని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న యోచనలో ఉన్నట్లు తెలి పారు. ఈ పోటీలలో విజేతలైన క్రీడాకారులందరికీ ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమ లో స్పోర్ట్స్ సెక్రటరి అంకం చౌదరి, డిస్ట్రిక్ ఆర్గనైజింగ్ సెక్రటరి కొత్తపల్లి బాల సుబ్రహ్మణ్యం, అనుశ్రీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీసీసీఐ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కమిటీ సభ్యులుగా ఎంపీ సానా సతీష్ బాబు

విశాలాంధ్ర - కాకినాడ : ముంబై నేడు జరిగిన బీసీసీఐ 94వ వార్షిక సాధారణ సమావేశం (AGM)లో ఆంధ్రప్రదేశ్ నుండి గౌరవ రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఫెసిలిటీస్ కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ కమిటీ దేశవ్యాప్తంగా క్రికెట్ మౌలిక వసతుల రూపకల్పన, అభివృద్ధి, పర్యవేక్షణలో కీలక పాత్ర పోషిస్తుంది. స్టేడి యంల నిర్మాణం, ఆధునీకరణ, శిక్షణా కేంద్రాల ఏర్పాటు, పిచ్‌లు మరియు మైదానాల నాణ్యత, నిధుల కేటాయింపు, ప్రాజెక్టుల పర్యవేక్షణ, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాల సాధన వంటి బాధ్యతలు ఈ కమిటీ పరిధిలోకి వస్తాయి. ఆంధ్రప్రదేశ్ నుండి ఇలాంటి ప్రతిష్ఠాత్మక కమిటీలో సభ్యుడిగా ఎన్నిక కావడం రాష్ట్ర ప్రజలకు గర్వకారణంగా మారింది. అభిమానులు, క్రీడాభిమానులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఈ నియామకం వల్ల రాష్ట్రానికి అనేక ప్రయోజనాలు కలిగే అవకాశం ఉంది. కొత్త స్టేడియంల నిర్మాణం, ఉన్న మైదానాల ఆధునీకరణ, శిక్షణా సదుపాయాల ఏర్పాటు, అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఆతిథ్యమివ్వగల వేదికల అభివృద్ధి వంటి అవకాశాలు ఆంధ్రప్రదేశ్‌లో మరింతగా పెరగనున్నాయి. విజనరీ ముఖ్య మంత్రి చంద్రబాబు మార్గదర్శకత్వంలో యువనేత నారా లోకేష్ ప్రోత్సాహంతో పాటు, ప్రధానమంత్రి, ఉప ముఖ్యమంత్రి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో వేగంగా పురోగతి సాధిస్తోంది. సతీష్ బాబు బీసీసీఐ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కమిటీలో సభ్యత్వం పొందడం రాష్ట్ర ప్రతిష్ఠను పెంచడమే కాకుండా, క్రీడా రంగంలో ఆంధ్రప్రదేశ్‌కు కొత్త అవకాశాలను తెరుస్తుందని విశ్వసించవచ్చు.

పిఠాపురం రాజా వారసుడు బీజేపీలో చేరిక

విశాలాంధ్ర - పిఠాపురం : పిఠాపురం మహారాజా కుమారులు రాజారావు బహదూర్ వేంకట మహీపతి రామరత్నరావు భారతీయ జనతా పార్టీలో చేరారు. పిఠాపురం పట్టణ ఉపాధ్యక్షుడు గరగ వీరబాబు ఆధ్వర్యంలో రామరత్నరావు భారతీయ జనతా పార్టీలో చేరారు. భారతీయ జనతా పార్టీ పిఠాపురం పట్టణ ఉపాధ్యక్షుడు గరగ వీరబాబు పిఠాపురం పట్టణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు ఓలేటి వేంకటేశ్వరరావు చేతుల మీదుగా భారతీయ జనతా పార్టీ కండువాను రామరత్నరావుకు వేసి భారతీయ జనతా పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రామరత్నరావుతో పాటు ఆయన అభిమానులు కూడా భారతీయ జనతా పార్టీలోకి చేరారు.

వైద్య సేవలు అందించడమే ధ్యేయం



విశాలాంధ్ర-దేవర పల్లి: నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ ధ్యేయమని దేవరపల్లి సుమంత్ మల్టీ స్పెషల్ హాస్పిటల్ డాక్టర్ సుమంత్ పేర్కొన్నారు ఆదివారంనాడు ఉచిత వైద్య శిబిరం మూడవరోజు సందర్భంగా డాక్టర్ సుమంత్ మాట్లాడుతూ 29వ తేదీన ప్రపంచ హార్ట్ డే పునస్కరించుకుని గత మూడు రోజులుగా తమ హాస్పిటల్లో ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించామని తెలిపారు. ఆదివారంతో ఈ ఉచిత వైద్య శిబిరం ముగిసింది అని తెలిపారు. సోమవారం ప్రపంచ హార్ట్ డే పురస్కరించుకొని దేవరపల్లిలో తమ ఆస్పటల్ వద్ద నుండి భారీ స్థాయిలో గుండె సమస్యలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు అధికారులు వైద్య సిబ్బంది పాత్రికేమిత్రులు పాల్గొంటున్నారని తెలిపారు గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య క్యాంపులో వివిధ విభాగాలకు చెందిన 15 మంది డాక్టర్లు పరిసర ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించారని తెలిపారు.

డా॥ బాబూ జగజ్జీవన్ రామ్ వర్ధంతి

విశాలాంధ్ర - అమలా పురం : స్థానిక గడియార స్తంభం సెంట ర్‌లో డా బాబూ జగజ్జీవన్ రామ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసి యేషన్, మాదిగల పొలిటి కల్ జెఏసి సంయుక్త ఆధ్వర్యంలో జగజ్జీవన్ రామ్ 39వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా డా బాబూ జగజ్జీవన్ రామ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మడికి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్ర మంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మడికి శ్రీరాములు, ఎఐసిసి మెంబర్ యార్లగడ్డ రవీంద్ర బాబూ జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాబూ జగజ్జీవన్ రామ్ కేంద్ర మంత్రిగా రక్షణ, రైల్వే, కార్మిక, వ్యవసాయ, తంతి తపాలా, సమాచార శాఖలలో పనిచేసి దేశాభివృద్ధికి ఎనలేని సేవలు చేసారని కొనియాడారు. డా బాబూ జగజ్జీవన్ రామ్‌కి భారత రత్న అవార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేంద్రు వాడపల్లి, ఉందుర్తి సతీష్, అడ్వకేట్ మోహనరావు, అయినవెల్లి అర్జున్, నల్గొండ రమేష్ పాల్గొన్నారు.

భవానీ భక్తులకు ఫ్రూట్స్ పంపిణీ

విశాలాంధ్ర- కోరుకొండ : రాజానగరం నియోజవర్గం కోరుకొండ మండలం జనసేన పార్టీ కోరుకొండమండల అధ్యక్షులు అద్దాల శ్రీను ఆధ్వర్యంలో విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి నడిచి వెళుతున్న భక్తులకు జనసేన నాయకులు, కార్యకర్తలు కలిసి బూరుగుపూడి గేటు వద్ద కోరుకొండ మీద నుంచి వెళ్తున్న భవానీలకు తమ వంతు ఫ్రూట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు అనంతరం వారు మాట్లాడుతూ అమ్మవారి దర్శనానికి మార్గం ద్వారా సురక్షంగా వెళ్లి అమ్మవారి దర్శనం చేసుకుని సురక్షంగా ఇంటికి చేరాలని భవానీలకు తెలియజేశారు రాత్రిపూట ప్రయాణం కూడా అందరూ కలిసే ప్రయాణం చేయండి అని కూడా వారికి సందేహం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలోఅద్దాల శ్రీనివాస్, మట్టా నాగేశ్వరావు, తస్నీరు తాతాజీ, చిక్కిరెడ్డి ముని ప్రసాద్, మల్లికార్జున, గట్టి గని రాజు, దోశపాటి అయోధ్య, సుభాష్, మండపాక శ్రీనివాస్,నరాల వీరేంద్ర (కన్నా) మారిశెట్టి త్రిమూర్తులు తదితర నాయకులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదముల పరిష్కార కమిషనర్, విజయవాడ.

F A I A No.612/2025 IN F A No. 329/2025

1. ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్, ప్రధాన కార్యాలయము, డోర్ నెంబరు: 14-113 బి, గ్రౌండ్ ఫ్లోర్ మత్తూ హట్ బావ్ కోతారతు రోడ్డు, చిల్లికల్ కొచ్చి - 682005

2. బ్రాంచ్ మేనేజరు ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నెంబరు: 34-1-18, టెంపుల్ స్ట్రీట్, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా.

- పిటిషనర్/అప్పిలేట్

మరియు

పట్నోలు నూకరాజు సత్యనారాయణమూర్తి S/o. పున్నయ్య, డోర్ నెంబరు 27-8-22, బోడవారి లైను, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా

- రెస్పాండెంట్

పై నెంబర్ అప్పిల్లో పిటిషనర్/అప్పిలేట్ దాఖలు చేసిన పిటిషన్ నెంబరు **FAIA No:612/2025** మీకు నోటీసు జారీ చేయడం నిమిత్తమై ఉండి ఉన్నది. మహారాజశ్రీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల రెడ్రెసల్ కమిషన్, విజయవాడ వారి ఆదేశాలు ప్రకారము ఈ నోటీసు జారీ చేయుటమైనది. పై నెంబరు **FAIA No: 612/2025**లో మీరు హాజరు కావలసిన **15-10-2025** గాను వాయిదా అయి ఉన్నది. కావున మీరు వ్యక్తిగతంగా గాని లేదా మీ తరపు వకీలు గారితో హాజరు కావాల్సి ఉన్నది.

వాయిదా **15-10-2025**

"బై ఆర్డర్"

కొల్లిపర కుమార్,
పిటిషనర్ తరపు అడ్వకేట్, విజయవాడ

నిరుద్యోగం, యువత వ్యతిరేక విధానాలపై పోరాడాలి

» భగత్‌సింగ్ జయంతి కార్యక్రమంలో

సీపీఐ ఏలూరు జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పులూరి హేమ శంకర్

విశాలాంధ్ర -ఏలూరు: దేశంలోని నిరుద్యోగం, ప్రభుత్వాల వ్యతిరేక విధానాలపై యువత భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాడాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పులూరి హేమశంకర్ పిలుపునిచ్చారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్), అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్‌ల ఆధ్వర్యంలో ఆర్.ఆర్.పేట స్ఫూర్తి భవన్ నందు భగత్ సింగ్ 118వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. భగత్ సింగ్ ఆశయాలను, వర్థిల్లాలి మార్క్సిజం, లెనినిజం అంటూ నినాదాలు చేశారు. భగత్ సింగ్ చిత్రపటానికి ఏఐవైఎఫ్ మాజీ నాయకులు భజంత్రి శ్రీనివాసరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి. శివకుమార్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ ఏలూరు జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ దేశం కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా ఎంచి అమరుడైన మహోన్నత వ్యక్తి సర్దార్ షాహిద్ భగత్ సింగ్ అని కొనియాడారు. చిన్నతనం నుంచి దేశ స్వాతంత్ర్య కాంక్ష కలిగి బ్రిటిష్ వారి నుండి దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావాలని నిరంతరం భగత్ సింగ్ ప్రయత్నం చేశారని కొనియాడారు. జలియన్ వాలాబాగ్ దారుణకాండ నుంచి జనరల్ డయ్యర్‌ను చంపడం ద్వారా జలియన్ వాలాబాగ్ దారుణకాండ అమరులకు నివాళులర్పించాలని పరితపించారని తెలిపారు. వారి స్ఫూర్తిని ప్రేరణను నేటి యువతరం తీసుకొని తాము ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి. శివకుమార్ మాట్లాడుతూ దేశంలో పెరిగిపోతున్న మతోన్మాద హింసకు వ్యతిరేకంగా, మతోన్మాద బిజెపి పాలనలో విద్యా విధానంలో సైతం మత సంబంధ అంశాలు పాఠ్యాంశాలుగా చేయడం విచారకరమన్నారు. భగత్ సింగ్ త్యాగాలను నేటి యువతరం ప్రేరణగా, స్ఫూర్తిగా తీసుకొని దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగం, ప్రభుత్వాలు అవలంబిస్తున్న యువత వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న విధానాలపై ఉద్యమించాలని అదే భగత్ సింగ్ చేసిన పోరాటానికి అసలైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకాశ్యామల,సీపీఐ ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శులు కురెళ్ల వరప్రసాద్, అడ్డగర్ల లక్ష్మీ ఇందిరా, కార్యవర్గ సభ్యులు కొల్లూరి సుధారాణి, కొండేటి బేబి, బళ్ల కనకదుర్గా రావు, లక్కోజు జగదీశ్వరి, ఏం. ఏ.హకీమ్, బి. కె.ప్రసాద్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి మందా క్రాంతి కుమార్, నాయకులు సిద్ధూ, ఆటోనగర్ అధ్యక్షులు అరుణ తార నాగేశ్వరరావు, అడ్డగర్ల సాకేత్, ఉప్పులూరి పూజ్య లక్ష్మీ అరుణ, ప్రొద్దుటూరి కార్తి, జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

విశాలాంధ్ర-భీమవరం : కళా రూపాల ద్వారా భగత్ సింగ్ ఆశయాలను ప్రజల్లో ప్రచారం చేస్తూ ఇప్టాను(ఇండియన్ థియేటర్స్ పీపుల్స్ అసోసియేషన్) బలోపేతం చేసే దిశగా అడుగులు వేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్ అన్నారు. సర్దార్ భగత్ సింగ్ జయంతి పురస్కరించుకుని ఇప్టా జాతీయ స్థాయి పిలుపులో భాగంగా సాంస్కృతిక చారిత్రాత్మక ప్రచార జాతను భీమవరంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ జయంతి స్ఫూర్తిదాయకమైన రోజుగా గుర్తింపబడిందన్నారు. దేశ వ్యాప్తంగా భగత్‌సింగ్ కల్చరల్ మార్చ్ ప్రారంభమైందని కళలు ద్వారా ప్రజల్లో ప్రేమ సామరస్యం సంఘీభావం యొక్క సందేశాన్ని ప్రగతి శీల సంస్థలతో కలిసి ప్రచారం చేస్తామన్నారు. ఇప్టా ద్వారా అమరవీరుల దినోత్సవాలను జాతీయ సాంస్కృతిక యాత్రగా ఇప్టా కళాకారులు గాంధీ జయంతి, రాజ్యాంగ దినోత్సవం, గణతంత్ర దినో త్సవం సావిత్రి బాయి పూలే జయంతి, యువజన దినోత్సవం, మానవ హక్కుల దినోత్సవం ఇతర ముఖ్య దినోత్సవాలు స్మరించుకుంటూ ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో అరసం జిల్లా అధ్యక్షులు వేల్పుల నాగేశ్వరరావు, కళా రంజని అధ్యక్షులు జవ్వాది దాశరధి శ్రీనివాస్, న్యాయవాది మల్లుల శ్రీనివాస్, ప్రజానాట్యమండలి కళాకారుడు చాంద్ బాషా పాల్గొన్నారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి

విశాలాంధ్ర -భీమవరం: కుల, మత అసమానతలు లేని సమ సమాజ నిర్మాణం కోసం తన కలంతో పోరాటం చేసిన మహాకవి గుర్రం జాషువా అని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ?గుర్రం జాషువా 130వ జయంతిని పురస్కరించుకుని పశ్చిమగోదావరి జిల్లా బిజెపి ఆధ్వర్యంలో ఆదివారం భీమవరం కె.ఎస్.రాజు ఫంక్షన్ హాల్లో ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాషువా చిన్నతనం నుండి తీవ్రమైన కులవివక్షను ఎదుర్కొన్నారని, చదువు కోసం డబ్బులు లేని పరిస్థితి నుండి దేశం గర్వించే స్థాయికి ఎదిగి పద్మభూషణ్ అవార్డును సొంతం చేసుకున్న మహనీయుడు అని కొనియాడారు. 'అంటరానివాడు' అని హేళన చేసినా ఎంతో పట్టుదలతో దేశంలో ప్రముఖ కవిగా గుర్రం జాషువా ఎదిగారని, సమాజంలో మార్పు కోసం ఆయన కవిత్వాన్ని ఒక కత్తిగా ఉపయోగించి ఎన్నో కథలను, కవిత్వాలను రాశారని తెలిపారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శవంతమైందని పేర్కొన్నారు. అనంతరం ఎస్.సి.హెచ్.బి.ఆర్.ఎం. రిటైర్డ్ హెడ్మాస్టర్ కలిగొట్ల గోపాల శర్మ, ఏ.ఆర్.కే.ఆర్ మున్సిపల్ హైస్కూల్ తెలుగు పండిట్ వేల్పుల నాగేశ్వరరావు, నాటక కళాకారులు జువ్వాది దాశరథి శ్రీనివాస్ లను కేంద్ర మంత్రి ఘనంగా సత్కరించారు. తొలుత కవి కోకిల గుర్రం జాషువా జీవిత విశేషాలతో కూడిన పుస్తకాన్ని కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ బిజెపి నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అంతకుముందు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఒక పెద్ద స్క్రీన్ పైన జాషువా జీవితాన్ని తెలిపే లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. ?ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి ముళ్ళపూడి రేణుక, బిజెపి రాష్ట్ర కార్యదర్శి బోగిరెడ్డి ఆదిలక్ష్మి, బిజెపి నర్సాపురం పార్లమెంట్ కన్వీనర్ పేరిచర్ల సుభాష్ రాజు, జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, మాజీ అధ్యక్షులు నార్ని తాతాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శులు తోట గంగరాజు, కలిదిండి వినోద్ వర్మ తోపాటు పెద్ద సంఖ్యలో బిజెపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

డాక్టర్ జీకేడీ ప్రసాద్‌కి జాషువా రాష్ట్ర పురస్కారం

విశాలాంధ్ర-కాట్రేనికోన : మండలంలోని నడవపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ జీకేడీ ప్రసాదరావుకి 2024 సంవత్సరం గుర్రం జాషువా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పురస్కారం లభించింది. విజయవాడ ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పింగళి వెంకయ్య సభావేదికలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ పురస్కారంలో రూ.50వేల నగదు, ప్రశంసా పత్రం, శాలువా, పుష్పగుచ్ఛం అందించారు. డాక్టర్ జీకేడీ ప్రసాదరావు 2011లో "దళిత జర్నలిజం" గ్రంథం, దేశంలో దళిత ప్రశ్నకు సంబంధించిన వ్యాస సంపుటి "సామాజిక"ను 2015లో వెలువరించారు. ఇవిగాక దళిత సంబంధిత సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక అంశాల మీద వివిధ పత్రికల్లో వందకు పైగా వ్యాసాలు రాశారు. డాక్టర్ ప్రసాదరావు ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగంలో ఫ్యాకల్టీగా పనిచేస్తున్నారు. పురస్కార ప్రదాన కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక మరియు సృజన శాఖ కార్యనిర్వహాక సంచాలకులు ఆర్ మల్లికార్జునరావు, విజయవాడ కలెక్టర్ ఎస్పీ షా, చైర్మన్ పొడపాటి తేజస్విని ఇతర చైర్మన్లు, ఇతర రాష్ట్ర అధికారులు పాల్గొన్నారు.

తీర్థప్రసాదాలు స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే దంపతులు

విశాలాంధ్ర - పెదపూడి : దేవీ నవరాత్రులు పురస్కరించుకొని కరకుదురులో శ్రీ కనకదుర్గమ్మ తల్లిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. శనివారం ఆలయంలో మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆదిలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వైసిపి గ్రామ కన్వీనర్ పెమ్మన బోయిడి గోవిందరాజు,అల్లం బాబులు అల్లం బాబులు ఉన్నారు.

అంబేద్కర్, గుర్రం జాషువాలకు మాజీ ఎంపీ భరత్ నివాళి

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాజమండ్రి పర్యటించి, 81ఏళ్ళు అయిన సందర్భాన్ని పురస్కరించుకుని 81 వ సంవత్సర వేడుకలు జరపడం అభినందనీయమని మాజీ ఎంపీ, వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ అన్నారు. అలాగే ప్రముఖ కవి గుర్రం జాషువా 130వ జయంతి వేడుకను కల్పి నిర్వహించడం పట్ల ఆయన హర్షం వ్యక్తంచేసారు. స్థానిక గోకవరం బస్టాండ్ దగ్గర దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యాన ఆదివారం ఉదయం జరిగిన వేడుకలలో మాజీ ఎంపీ భరత్ పాల్గొని డా అంబేద్కర్ విగ్రహానికి, గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బ్రిటిష్ వైస్రాయ్ కౌన్సిల్ మెంబర్ (కార్మిక శాఖ) హోదాలో 1944 సెప్టెంబరు 28 వ తేదీన రాజమండ్రి పర్యటించడం రాజమహేంద్ర వరానికే ఎంతో గర్వకారణమని మాజీ ఎంపీ భరత్ పేర్కొన్నారు. డా అంబేద్కర్ ని ఆనాటి మున్సిపల్ కౌన్సిల్ స్వాగతించి, పౌరసన్మానం చేయడం, కాస్మోపాలిటన్ క్లబ్ లో అప్పటి లాయర్లు సన్మానించడం చారిత్రక ఘటనలని ఆయన పేర్కొన్నారు. అలాగే ప్రముఖ దళిత కవి గుర్రం జాషువా కోటిలింగాల పేటలో 5 సంవత్సరాలు జీవించారని తెలిపారు. తెలుగు సాహిత్యానికి జాషువా ఎంతో కృషి చేసారని, ఆయన రచనలు సమాజానికి ఎంతో మేలు చేశాయని మాజీ ఎంపీ భరత్ అన్నారు.

ప్రపంచంలో ఐదవ శక్తిగా భారత్

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో ఉన్న సంపూర్ణ ఫర్నిచర్ లక్ష్మీ కాస్మోటిక్స్ వద్ద ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు బోనం సత్య వరప్రసాద్ అధ్యక్షతన జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు.బీజేపీ జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్, ఛాంబర్ ప్రధాన కార్యదర్శి కొమ్మూరి వెంకటాచల ప్రసాద్, ఛాంబర్ కోసాధికారి దొమ్మేటి సాయిబాబు, నల్లా సుబ్బారావు, గోకరకొండ గంగన్న స్వామి, మాజీ ఎంఈవో జంగా రాజేంద్ర కుమార్, అయ్యల భాషా తదితరులు పాల్గొన్నారు.